ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 157
శనివారం 7 డిసెంబర్ 2024
చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్
HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## పింక్ బాల్ టెస్ట్‌లో తేలిపోయిన టీమిండియా

- తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు
- విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆదుకున్న నితీష్‌కుమార్ రెడ్డి
- భారీ స్కోరు దిశగా ఆస్ట్రేలియా



.. వివరాలు 7లో

# వాళ్ల వెన్నులో వణుకుపుట్టాలి

## డ్రగ్స్ రవాణాదారులు తెలంగాణకు రావాలంటే భయపడాలి


- సైబర్, డ్రగ్స్ పేరుతో కొత్త నేరాలు
- పైరవీలు లేకుండా పోలీసులకు పదోన్నతులు, బదిలీలు
- పోలీస్, ఫైర్ శాఖల్లో 15 వేల ఉద్యోగాలు భర్తీ
- ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్ల నియామకం
- హోంగార్డులకు రోజుకు రూ.వెయ్యి వేతనం
- ఎస్టీఆర్ఎఫ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ అరికడుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. డ్రగ్స్ రవాణాదారులు తెలంగాణ రావాలంటే భయపడాలని హెచ్చరించారు. డ్రగ్స్‌పై కాలేజీలు, స్కూళ్లలో అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల భవిష్యత్ పట్ల పాఠశాల యాజమాన్యాలు బాధ్యతగా ఉండాలని అన్నారు.

**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** డ్రగ్స్, గంజాయి కేసులు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ ఒత్తిడి, పైరవీలకు తావులేకుండా అధికారులు పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పైరవీలు లేకుండా పోలీసులకు పదోన్నతులు, బదిలీలు చేస్తున్నామని తెలిపారు. పోలీస్, ఫైర్ శాఖల్లో 15 వేలమందికి నియామక పత్రాలు అందజేసినట్లు వివరించారు. సైబర్, డ్రగ్స్ పేరుతో కొత్త నేరాలు పుట్టుకువస్తున్నాయని హెచ్చరించారు. టీజీన్యాబ్‌కు డీజీ స్థాయి అధికారిని నియమించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

మిగతా 2 లో



## వాహనాల క్రమబద్ధీకరణకు స్క్రాప్ పాలసీ

- 15 సంవత్సరాలు దాటిన వాహనాలకు సరికొత్త పాలసీ
- వాయు కాలుష్యం వెదజల్లే వాహనాలపై దృష్టి
- డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేందుకు రంగం సిద్ధం
- డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు అవతల నడిపేలా చర్యలు
- ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే సిటీలో పర్మిషన్

**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** ఇప్పటికే మహాలక్ష్మీ ఉచిత బస్సు పథకంతో ఇబ్బంది పడుతున్న ఆటోలకు ఇది మరో షాకింగ్ న్యూస్..! ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వ అలర్ట్ అయింది. వాయు కాలుష్యం ఎక్కువగా వెదజల్లే వాహనాల క్రమబద్ధీకరణకు కొత్త పాలసీని అమలు

మిగతా 2 లో

## కాంగ్రెస్ ప్రభుత్వం స్వేచ్ఛను హరిస్తున్నది

- ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే నిర్బంధాలా?
- నామీద అక్కసుతో సచివాలయం గేట్లు కూడా తెరవడం లేదు
- మాజీ మంత్రి కేటీఆర్



## రాజ్యసభలో నోట్ల కలకలం



- 222 సీటు వద్ద రూ. 500 కట్టలు
- సభకు కేవలం రూ.500తో మాత్రమే వెళ్తా : ఎంపీ సింఘ్వీ

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కీలక పరిణామం చో టు చేసుకుంది. ఎగువ సభ లో భారీగా నగదు పట్టుబడిం ది. ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీ టు వద్ద నోట్ల కట్ట లభ్యమైన ట్లు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ తాజాగా వెల్లడించారు.

04

## ప్రపంచం ముంగిట మరో పెనుముప్పు





దడపుట్టిస్తున్న బ్లీడింగ్ ఐ వైరస్..

15 రోజుల్లో 150 మంది మృత్యువాత

చికిత్సలేక ఇళ్లలోనే చనిపోతున్న జనాలు

04



ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో

## 8న కేసీఆర్ సమావేశం

- ఎర్రవెల్లి క్షేత్రంలో భేటీ కానున్న కేసీఆర్

02

## పెద్దపల్లి ఎంపీ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్



02

# వీధి కుక్కల దాడి

## 26 మంది చిన్నారులకు గాయాలు మహబూబనగర్‌లో దారుణం

వీధి కుక్కల దాడిలో 25 మంది చిన్నారులకు గాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 25 మంది చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయి. కుటుంబీకులు చిన్నారులను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని కాలనీ వాసులు మండిపడ్డారు.



**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** మళ్లీ పిచ్చికుక్కల దాడులు మొదలయ్యాయ్. నిన్నమొన్నటి వరకు కంటిపై కునుకులేకుండా చేసిన కుక్కలు మళ్లీ దాడులకు తెగబడుతున్నాయ్. తాజాగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. తాజాగా మహబూబ్‌నగర్‌లో ఓ కుక్క ఏకంగా 24 మంది పిల్లలపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచింది. వివరాల్లోకెళ్తే..రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాల్లో పిచ్చికుక్కల దాడిలో దాదాపు 26 మంది

మిగతా 2 లో



## రేవంత్ రెడ్డి హోదా, స్థాయిని మరిచి మాట్లడుతున్నారు

చిల్లర మాటలు మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం


.. వివరాలు 6లో



## గ్రూప్-1 పరీక్షల రద్దు కుదరదు

- తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట
- పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమన్న ధర్మాసనం

02



బంగాళాఖాతంలో

## మరో అల్పపీడనం!

- తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపే అవకాశం
- పలు ప్రాంతాల్లో జోరు వానలకు అవకాశం


02

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం 7
డిసెంబర్
2024







### వాహనాల క్రమబద్ధీకరణకు

# స్క్రాప్ పాలసీ

మొదటి పేజీ తరువాయి

చేయాలని నిర్ణయించింది తెలంగాణ ప్రభుత్వం. అందులో భాగంగా 15 సంవత్సరాలు దాటిన వాహనాలకు సరికొత్త స్క్రాప్ పాలసీని తీసుకొచ్చింది. అంతేకాకుండా డీజిల్ వాహనాలను నగర శివారు ప్రాంతాలకే పరిమితం చేయాలని భావిస్తోంది. కాలుష్యం ఎక్కువగా పెరిగిపోతుడడంతో హైదరాబాద్ మహానగరంలో డీజిల్ వాహనాలపై ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. అందులో భాగంగా హైదరాబాద్‌లో నడుస్తున్న ఆర్టీసీ బస్సుల్లో 90% బస్సులు డీజిల్ వాహనాలే. అందుకని డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు అవతలకు తరలించాలని నిర్ణయించింది. ఇక, మూడు వేల కొత్త ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో తిప్పనున్నారు. ఇక, బస్సుల తర్వాత అత్యధికంగా రోడ్ల మీద నడిచే వాహనాల్లో ఆటోలు కూడా ప్రధానం. అందుకనే డీజిల్‌తో నడిచే ఆటోలను కూడా ఔటర్ రింగ్ రోడ్డు బయటకు తరలించాలని రింగ్ రోడ్డు లోపల తిరిగేందకు ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే పర్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది.ఈ విషయాన్ని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి గురువారం జరిగిన రవాణా శాఖ ఉత్సవాల్లో ప్రకటించారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకొందామని సీఎం పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడాలంటే ఎట్టి పరిస్థితుల్లో డీజిల్ వాహనాలు తిరగకూడదని చెప్పారు. డీజిల్ బస్సులను ఔటర్ రింగ్ రోడ్డు వరకే పరిమితం చేయాలని సూచించారు. అలాగే డీజిల్ ఆటోలను సైతం నగర శివారులకు తరలించాలని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఎలక్ట్రిక్ బస్సులు వాడాలనుకోవడం సరే, కానీ ఇప్పటికే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు స్కీం తో ఆదాయ కోల్పోయిన ఆటోలకు ఇప్పుడు డీజిల్ ఆటోలకు సిటీలో తిరగనివ్వమని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అది కచ్చితంగా షాకింగ్ న్యూస్ అంటున్నారు. అయితే దీనిపై ఇప్పుడు ఆటో యూనియన్ ఎలా స్పందిస్తాయో చూడాలి. హైదరాబాద్ మహానగరంలో దాదాపుగా ఆటోలన్ని ఎల్పీజీ తో నడు-స్తూ ఉన్నాయి. అయితే హైదరాబాద్‌లో నడుస్తున్న డీజిల్ ఆటోల సంఖ్య ఎంత అనేది తేలితే ఈ నిర్ణయం వల్ల ఆటో యూనియన్ నుంచి వ్యతిరేకత ఎంత మేర వస్తుందనేది అంచనా వేయొచ్చు..! కాలుష్యాన్ని తగ్గించాలనుకోవడం మంచి ఆలోచన. డీజిల్ వాహనాలను ఔటర్ రింగ్ రోడ్డు లోపల తిరగవద్దనుకునే ఆలోచన మంచిదే..! కానీ దానివల్ల ఆటో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు మాత్రం నగరంలో డీజిల్ ఆటోలు తిరగకూడదని నిర్ణయం వల్ల ఇబ్బంది పడటం తప్పని పరిస్థితిలో కనిపిస్తుంది..



# వీధి కుక్కల దాడి

మొదటి పేజీ తరువాయి

చిన్నారులు గాయపడ్డారు. మహబూబ్‌నగర్ పట్టణంలో గురువారం రాత్రి 7 నుంచి 8.30 గంటల ప్రాంతంలో గోల్ మజీద్, పాత పాలమూరు ఏరియాలో ఓ పిచ్చికుక్క స్థానికులను భయకంపితులను చేసింది. చిన్నారుల వెంట పడి కరుస్తూ పలువురిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడిలో దాదాపు 24 మంది చిన్నారులు గంటల వ్యవధిలోనే గాయపడ్డారు. చిన్నారులందరికీ జనరల్ ఆస్పత్రిలో టీటీ ఏఆర్‌వీ టీకాలు ఇచ్చారు. వీరిలో ఐదుగురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని జనరల్ ఆస్పత్రిలో చేర్పించుకుని డాక్టర్ల పరిశీలనలో ఉంచినట్లు ఆర్‌ఎంవో డాక్టర్ జరీనా తెలిపారు.పిచ్చికుక్క దాడిలో గాయపడిన చిన్నారులను గురువారం రాత్రి జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరామర్శించారు. పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లాలోని కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని, వాటికి ఇంజెక్షన్లు వేయించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. మరో ఘటనలో ఇంటి ముందు ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై వీధికుక్క ఒకటి దాడి చేసింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కొల్లాపురంలో ఈ ఘటన జరిగింది. కొల్లాపురంలో నివాసం ఉంటున్న మహేశ్ కూతురు స్మైలీ, కారం సుమన్ కుమారుడు అచ్చితానంద గురువారం సాయంత్రం ఇంటి ముందు ఉన్న స్థలంలో ఆడుకుంటున్నారు. ఇంతలో ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదుగానీ ఓ పిచ్చికుక్క వీరిద్దరిపై దాడికి పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి చిన్నారులను కుక్క బారి నుంచి కాపాడారు. వెంటనే గాయపడిన చిన్నారులను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# వాళ్ల వెన్నులో వణుకుపుట్టాలి..

**హైదరాబాద్, డిసెంబర్6:** సమాజంలో కొత్త పుంతలు తొక్కుతున్న నేరాలను అరికట్టడంలో సరికొత్త వ్యూహాలతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర పోలీసు శాఖకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ మహమ్మారిని నిరోధించడానికి పోలీసు శాఖలో సుశిక్షితులైన వారితో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని దిశానిర్దేశం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి రాజ్యాంగ స్ఫూర్తిని, పోలీస్ రైజింగ్ డేను స్మరిస్తూ, ప్రజా సేవ కోసం ఎక్కువ సమయం విధి నిర్వహణలో ఉంటున్న హోంగార్డులకు ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పలు వరాలను ప్రకటించారు. ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాలు కార్యక్రమాల్లో భాగంగా హోం శాఖ విజయాలపై నెక్లెస్ రోడ్డు హెచ్‌ఎండీఏ మైదానంలో నిర్వహించిన సదస్సులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాలు, డాగ్ స్క్వాడ్‌లు ఇచ్చిన ప్రదర్శనలను తిలకించారు. ఆయా విభాగాలు వినియోగించే ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన పరికరాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు. ట్రాఫిక్ అసిస్టెంట్స్‌గా నియమితులైన ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులకు నియామక పత్రాలను అందించారు. అనంతరం ముఖ్యమంత్రి సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ.. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను నిరోధించడంలో కొంత ప్రగతి సాధించినప్పటికీ ప్రస్తుత చర్యలు సరిపోవు. మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉంది. డ్రగ్స్, సైబర్ క్రైమ్స్ వంటి కేసుల్లో న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడేలా విధంగా స్పెషల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి సుశిక్షితులైన అధికారులను నియమించాలి. ఈ కేసుల కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరంలో ప్రధానంగా కాలుష్యం తగ్గించడం, ట్రాఫిక్ ను నియంత్రించాల్సిన అవసరం ఎంతో ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ట్రాన్స్ జెండర్లు అడుక్కునే దృశ్యాలను గమనించి, వారు ఆత్మగౌరవంతో





బతకడానికి, జనజీవన స్రవంతిలో చేర్చాలన్న ఉద్దేశంతో ట్రాఫిక్ అసిస్టెంట్స్‌గా విధుల్లోకి తీసుకోవడం జరిగింది. సమాజంలో వారు వివక్షకు గురికావొద్దు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోతున్న పోలీసు ఉన్నతోద్యోగులకు పరిహారం చెల్లిస్తున్నట్టుగానే, హోం గార్డులు ఎవరైనా ప్రమాదవ శాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని నిర్ణ యించాం. అలాగే, హోం గార్డులకు రోజుకు 921 రూపా యలు చెల్లిస్తుండగా, ఇకనుంచి 1000 రూపాయలకు పెంపు. వీక్లీ పరేడ్ అలవెన్స్ రూ.100 నుంచి రూ.200 కు పెంపు. ప్రభుత్వ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు అం దుతున్నట్టుగా హోం గార్డులకు ఆ సౌకర్యాలు లేని కారణంగా వారి కుటుంబాలను రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు చేస్తాం. ఇవన్నీ జనవరి ఒకటి నుంచి అమలు చేస్తాం. పోలీసు పిల్లలు సైతం ఉన్నతమైన విద్యను అభ్యసించాలన్న లక్ష్యంతో నేషనల్ డిఫెన్స్ అకాడమీ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్లకు తీసిపోకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి 50 ఎకరాల్లో పోలీస్ స్కూల్ ప్రారంభిస్తున్నాం. ఎక్కడి నుంచి వచ్చారంటే పోలీస్ స్కూల్ నుంచి వచ్చామని సగర్వంగా చెప్పుకునే స్థాయిలో తీర్చిదిద్దుతామని చెప్పారు. సమాజానికి ఎన్నో సేవలు అందిస్తున్న పోలీసు ఉద్యోగం అంటే మీకు ఉపాధి కాదు. ఇదొక భావోద్వేగం. ప్రభుత్వ ప్రతిష్టను కాపాడే బాధ్యత మీపైన ఉంది. ఫ్రెండ్లీ పోలీసు అంటే... బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి. బాధితులు, అన్యాయానికి గురైన వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలి. కబ్జాలు, హత్యలు, ఆర్థిక నేరగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరించాలి. నేరగాళ్లకు ప్రోటోకాల్ పాటిస్తే మీరు మీ విధులను నిర్వర్తించలేరు. సమాజంలో ఎక్కువ సేవలు అందిస్తున్నది పోలీసులే. అలాగే ఎక్కువ విమర్శలు ఎదుర్కోనేది కూడా పోలీసులే. యూనిఫామ్ ఫోర్స్ అంటే క్రమశిక్షణతో ఉండాలి. మీకేవైనా సమస్యలు ఉంటే వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రజల సమస్యలను పరిష్కరించే మీకు సమస్యలు ఉండొద్దు... అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు హోం శాఖ కార్యదర్శి, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, ఆయా విభాగాల అధిపతులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి ఎంపీ ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, డిసెంబర్ 6:** పెద్దపల్లి ఎంపీ ఎన్నిక చెల్లదంటూ తెలంగాణ హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. తన నామినేషన్‌ను అకారణంగా రిజెక్ట్ చేశారని.. ఆ తర్వాత పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించారని స్వతంత్ర అభ్యర్థి, న్యాయవాది పులిపాక రాజ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ నాయకుడు గడ్డం వంశీ ఎన్నిక చెల్లదని.. పెద్దపల్లిలో ఎంపీ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని తన పిటిషన్‌లో పులిపాక రాజ్‌కుమార్ కోరారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ఎన్నికల అధికారి, ఎంపీలను పార్టీ చేస్తూ ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఈపీ 31/2024 ద్వారా ఈ పిటిషన్ దాఖలు అయింది.

# పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో 8న కేసీఆర్ సమావేశం

### ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో భేటీ కానున్న కేసీఆర్

**హైదరాబాద్, డిసెంబర్ 6 :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎల్లుండి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నారు. ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 1 గంటలకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమవుతారు. ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం జరగనుంది. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. సచివాలయంలో ఏర్పాటు చేస్తోంది తెలంగాణ తల్లి విగ్రహమా? లేక కాంగ్రెస్ తల్లి విగ్రహమా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని మండిపడ్డారు. నాలుగేళ్ల తర్వాత తెలంగాణ తల్లి విగ్రహం ఎక్కడ ఉండాలో అక్కడే ఉంటుందన్నారు. అలాగే రాజీవ్ గాంధీ విగ్రహం ఎక్కడ ఉండాలో అక్కడికే పంపిస్తామన్నారు.



# గ్రూప్-1 పరీక్షల రద్దు కుదరదు

### తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట

### పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమన్న ధర్మాసనం

**హైదరాబాద్, డిసెంబర్ 6 :** గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు కుదరదని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దు, మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. విచారణ జరిపిన న్యాయస్థానం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో ఊరట లభించినట్లయింది. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త నోటిఫికేషన్ చట్ట విరుద్ధమని కొంతమంది అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రిలిమ్స్‌లో 14 తప్పులున్నాయని పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌ను వాయిదా వేయాలని కోరారు. అభ్యర్థుల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును అభ్యర్థులు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్లు మెయిన్స్‌కు క్వాలిఫై కానందున మెయిన్స్ పరీక్ష వాయిదా వేయాల్సిన అవసరం లేదని తెలిపింది. పరీక్షల నిర్వహణలో కోర్టుల జోక్యం అనవసరమని ధర్మాసనం పేర్కొంది. కోర్టుల నిర్ణయంతో నియామకాల్లో జాప్యం జరుగుతుందని తెలిపింది. మెయిన్స్ నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వానికి పచ్చజెండా ఊపింది.

# లగచర్ల కేసులో నరేందర్ రెడ్డి కస్టడీకి కోర్టు అనుమతి

### నేడు చర్లపల్లి నుంచి వికారాబాద్‌కు తరలించనున్న పోలీసులు

**హైదరాబాద్, డిసెంబర్ 6 :** వికారాబాద్ జిల్లాలోని లగచర్ల దాడి కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డిని కొడంగల్ కోర్టు పోలీస్ కస్టడీకి అనుమతించింది. నరేందర్ రెడ్డిని తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం నరేందర్ రెడ్డిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అనుమతించింది. ఆయన ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉన్నారు. అతనిని రేపు చర్లపల్లి జైలు నుంచి వికారాబాద్‌కు తరలిస్తారు. రెండు రోజుల పాటు అక్కడ ప్రశ్నిస్తారు.

# చెత్తపై పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ చర్యలు

### సిటీలో జీవీపీ పాయింట్స్ ఏర్పాటుకు సన్నద్ధం

### ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయం

**హైదరాబాద్, డిసెంబర్ 6 :** హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ పరిధిలో చెత్త పెద్ద సమస్యే. చెత్తను ఎక్కడపడితే అక్కడే వేస్తున్నారు. సమస్య పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ అనేక చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేదు. దీంతో దుర్వాసన, దోమలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో జీహెచ్‌ఎంసీ కొత్త ప్రణాళికను రూపొందించేందుకు సన్నద్ధమవుతోంది. ఐతే.. ఇందులో ఒక షాక్ కూడా ఉంది. ఈ చెత్తను సేకరించడానికి ప్రభుత్వం సిటీలో అక్కడక్కడా గార్బేజ్ వర్నరబుల్ పాయింట్ లను గుర్తించింది. ఇవన్నీ తీవ్రమైన చెత్తను పారపోస్తున్న ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. ఇక్కడ ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ముగ్గులు వేయడం, ప్రత్యేకంగా ఓ వ్యక్తిని కాపాలాగా పెట్టడం వంటి కొన్ని చర్యలను చేపట్టింది. అయినా ప్రజలు తీరు మార్చుకోవట్లేదనీ, ఏదో ఒక రకంగా చెత్త వేస్తూనే ఉన్నారని అధికారులు అంటున్నారు. గ్రేటర్‌లో చెత్త సమస్యను పరిష్కరించడానికి జీహెచ్‌ఎంసీ కొత్త ప్లాన్ రూపొందించింది. చెత్త పేరుకుపోకుండా, చెత్త కనిపించకుండా ఉండడానికి



ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జీహెచ్‌ఎంసీ పరిధిలోని చాలా ప్రాంతాల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్ పేరుతో ఆల్రెడీ ఏర్పాటు చేశారు. చెత్త వేసినప్పుడు ఆ చెత్త.. డస్ట్ బిన్‌లో పడకుండా.. కింద పడితే.. అది ప్రజలకు కనిపించకుండా ఉండేలా ఈ క్యాబిన్‌లను రూపొందించారు. తద్వారా ఆ చెత్త ఉన్న ప్రదేశం చూడటానికి అందంగానే కనిపిస్తుంది. ప్రధానంగా మురికివాడల్లో ఈ క్యాబిన్ లను మరింతగా ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. చెత్త ఎక్కువగా పేరుకుపోతున్న ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. మొదటి దశలో తీవ్రమైన చెత్త ఉత్పత్తి ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ప్రత్యేక క్యాబిన్‌లో రెండు డస్ట్ బిన్‌లు ఉంటాయి. చెత్త కనిపించకుండా ఉండేలా క్యాబిన్‌ను రూపొందించారు. ప్రధానంగా చెత్త ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మురికివాడల్లో గార్బేజ్ కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. చాలా ప్రాంతాల్లో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తున్నట్లు గుర్తించారు. దీనిని అరికట్టడానికి భారీగా పెనాల్టీ వేయాలని నిర్ణయించారు. దీనికోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్ తయారు చేస్తున్నామనీ, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. తద్వారా త్వరలో భారీ ఫైన్లు వేసేందుకు అధికారులు ప్లాన్ రెడీ చేస్తున్నట్లు తెలిసింది. అందువల్ల ప్రజలు అప్రమత్తమై.. చెత్తను ఎక్కడ వెయ్యాలో అక్కడే వెయ్యడం ద్వారా ఎలాంటి సమస్యా ఉండదు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 7 డిసెంబర్ 2024





# నేడు హైటెక్స్‌లో ట్రస్మా-ఎడెక్స్ సెమినార్...అవార్డుల పర్వం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డుల ప్రధానం
- హైటెక్స్ లో ఏర్పాట్లను పర్యవేక్షించిన సాధుల మధుసూదన్ బృందం
- బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ సమగ్రాభివృద్ధి కోసం ట్రస్మా కృషి

హైదరాబాద్, డిసెంబర్ 6 రోమింగ్ న్యూస్: విద్యారంగంలో వస్తున్న నూతన ధోరణులను తెలియజేయడంతో పాటు నాణ్యత, ఆవిష్కరణలు, సుస్థిరత, మరియు విద్యార్థి సమగ్రాభివృద్ధి లక్ష్యాలు సాధించేందుకు ట్రస్మా-ఎడెక్స్ పేరుతో శనివారం సెమినార్, అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ రావు, కోశాధికారి రాఘవేంద్ర రెడ్డిలు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. బ్రెయిన్ ఫీడ్... ఎడెక్స్ ల సౌజన్యంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ట్రస్మా పీ.ఎస్.టీ లతో పాటు అడ్వైజర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా పీ.ఎస్.టీ లు ఇతర కార్యవర్గ సభ్యులు శుక్రవారం రాత్రి వరకు హైటెక్స్ లో ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాలలను క్వాలిటీ ఎడ్యుకేషన్ కు వేదికలుగా మార్చేందుకు జరుగుతున్న కృషిలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పాఠశాలల నిర్వాహకులు మరియు విధాన రూపశిల్పులకు అనువైన వేదికగా ఇది దోహదపడనుంది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఇది ముఖ్యమైన అవకాశంగా నిలువనున్నది. పాఠశాలల నిర్వహకులు మరింత స్ఫూర్తివంతంగా విద్యాసంస్థలను నడపడానికి కావలసిన శిక్షణ ఇవ్వడానికి సుదీర్ఘ ఉపన్యాసాలను కూడా నిపుణులతో ఏర్పాటు చేశారు.

**హైటెక్స్‌లో ఘనంగా ఏర్పాట్లు**

ట్రస్మాబి ఎడెక్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో 5వ ఎడిషన్ 2024 కాన్ఫరెన్స్, ఎక్స్‌పో, అవార్డ్స్ కార్యక్రమానికి ఏర్పాట్లను పూర్తి చేశారు. హైదరాబాద్ హైటెక్స్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది.

**షెడ్యూలు ఇదిగో....**

ఈ కార్యక్రమం ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు కొనసాగుతుంది. విద్యా రంగంలో కీలక అంశాలు మరియు భవిష్యత్తు ధోరణులపై చర్చలు, ప్రదర్శనలు, పనివిధానాలు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిలబెత్తనున్నాయి.

**నిర్వహకుల్లో ప్రేరణకు దోహదం**

ఈ కార్యక్రమం తెలంగాణ విద్యా వ్యవస్థలో నాణ్యత, ఆవిష్కరణ, మరియు సుస్థిరతను మెరుగుపరచడంలో ముందడుగు వేయడానికి ప్రేరణనిస్తుంది. విద్యావేత్తలు, పాఠశాల నాయకులు, విధాన రూపశిల్పులు మరియు నిపుణులను ఒకే వేదికపైకి తీసుకురావడం దీని లక్ష్యం.







**ముఖ్య అతిథులు మరియు గౌరవ వక్తలు**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సాయంత్రం మూడు గంటలకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హాజరుకానున్నారు. నిపుణులైన వక్తలు ముఖ్యమైన విద్యా మరియు బాలల అభివృద్ధి అంశాలపై ప్రసంగించనున్నారు:

డా. సి. వీరేందర్ – కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ మరియు వ్యక్తిత్వ వికాస శిక్షకులు కార్యక్రమంలో తొలి ప్రసంగం చేయనున్నారు. సోనల్ ఆంద్ర్యూస్ %-% డైరెక్టర్, ఇంటిగ్రేటెడ్ ప్రీ స్కూల్ టీచర్స్ ట్రైనింగ్ అకాడమీ (IPTTA) హాజరుకానున్నారు.

డా. సువర్ణ వినాయక్ %-% ఎస్‌సీఈఆర్టీ పాఠ్య పుస్తక సమన్వయకర్త మరియు ఎన్‌సీఈఆర్టీ మాజీ సాధారణ సభ్యులు ప్రసంగం చేయనున్నారు.

మల్లా రాము నాయుడు – డైరెక్టర్, స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ లు హాజరుకానున్నారు. ఈ వక్తలు విద్యార్థుల సంక్షేమం, ఆవిష్కరణాత్మక బోధన విధానాలు మరియు విద్యా ప్రమాణాలపై విలువైన అంశాలను చర్చిస్తారు.

**ప్రధాన కార్యాచరణలు**

ఈటీ టెక్ ఎక్స్ 2024 లో ట్రస్మా విద్యా రంగంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు మరియు పాఠశాలలలో నాణ్యతను పెంచే దిశగా సిద్ధమైంది. ముఖ్యమైన అంశాలు ఈ విధంగా ఉంటాయి: ఉదయం 9:00 నుంచి 9:30 వరకు %-% నమోదు మరియు ప్రారంభ వేడుకల కార్యక్రమం ప్రాతిపదికా నమోదు ప్రక్రియ మరియు ప్రారంభ వేడుకతో ప్రారంభమవుతుంది. ఉదయం 10:30 నుంచి 11:15 వరకు –డా. సి. వీరేందర్ ప్రసంగం "విద్యార్థుల భావోద్వేగ సంక్షేమం %-% పాఠశాలల పాత్ర" డా. వీరేందర్ విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై మరియు పాఠశాలల ముఖ్య పాత్రపై వివరించనున్నారు.

మధ్యాహ్నం 12:00 నుంచి 12:45 వరకు %-% శ్రీమతి సోనల్ ఆంద్ర్యూస్ ప్రసంగం "చిన్నారుల కోసం ఆటల ద్వారా బోధన విధానం" ఆటల ద్వారా బోధన విధానం పిల్లల సృజనాత్మకత మరియు గుణాత్మక అభివృద్ధిపై చర్చించనున్నారు.

మధ్యాహ్నం 12:45 నుంచి 1:15 వరకు %-% మల్లా రాము నాయుడు ప్రసంగం "ఇసిసి పరిధిలో ఆవిష్కరణాత్మక బోధన విధానాలు"

ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ECCE) లో సృజనాత్మక బోధన విధానాలపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 3:15 నుంచి 4:00 వరకు %-% డా. సువర్ణ వినాయక్ ప్రసంగం "విద్యా ప్రమాణాలు మరియు అభ్యాస ఫలితాలు" విద్యా ప్రమాణాల నిర్వహణ మరియు విద్యార్థుల అభ్యాస ఫలితాలపై ప్రామాణికమైన అంశాలను చర్చిస్తారు. సాయంత్రం 4:00 నుంచి 6:00 వరకు %-% అవార్డుల ప్రదానం ఎందుకు షెడ్యూలు ఖరారు చేశారు. విద్యారంగంలో ప్రతిభావంతులను గౌరవిస్తూ అవార్డుల ప్రదానంతో కార్యక్రమం ముగుస్తుంది.

**ఎక్స్‌పో మరియు నెట్‌వర్కింగ్ అవకాశాలు**

కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యా ఎక్స్‌పో కొనసాగుతుంది. పాఠశాల విద్యను మార్గనిర్దేశం చేసే అత్యాధునిక పరికరాలు, సాంకేతికతలను ఇందులో ప్రదర్శిస్తారు. ఈ సందర్భంగా చాయ పానాలు మరియు మధ్యాహ్న భోజన విరామాల్లో ప్రదర్శన కర్తలతో చర్చించేందుకు అవకాశాలు లభిస్తాయి.

**ఆర్గనైజింగ్ కమిటీ**

ట్రస్మా సమర్థ నాయకత్వం కింద ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.కన్వీనర్ గా ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షులుకె. శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించనున్నారు. సహ కన్వీనర్లు గా హైదరాబాద్ జిల్లా తస్మా అధ్యక్షులు కె. ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ అహ్మద్, కోశాధికారి మంచాల రఘు లు ఏర్పాట్లలో తలమునకలయ్యారు.

---

# 51 గ్రామాల విలీనానికి లైన్ క్లియర్

### ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి గ్రీన్ సిగ్నల్

### పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సర్పంచుల పిటిషన్

### పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 6 : ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాల విలీనానికి లైన్ క్లియర్ అయింది. మున్సిపాలిటీల్లో 51 గ్రామాల విలీనానికి ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌కు హైకోర్టులో అడ్డంకులు తొలగిపోయాయి. పంచాయతీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ.. మాజీ సర్పంచులు వేసిన పిటిషన్‌ను కొట్టేసింది హైకోర్ట్.పెద్ద అంబర్‌పేట, శంషాబాద్, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట మున్సిపాలిటీల్లో 51 గ్రామాలు విలీనం కానున్నాయి. మేడ్చల్ జిల్లాలో మొత్తం 28 గ్రామాలు ఏడు మున్సిపాలిటీల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 12 గ్రామాలు, సంగారెడ్డి జిల్లాలో రెండు మున్సిపాలిటీల్లో 11గ్రామాలు విలీనం కానున్నాయి. ఈ గ్రామాలన్నీ కూడా ఔటర్ రింగు రోడ్డుకు అనుకున్న గ్రామాలే. శివారు గ్రామాలు మున్సిపాలిటీల్లో విలీనం తర్వాత వీటన్నింటినీ గ్రేటర్‌లో కలిపే అవకాశం ఉంది. పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలో బాచారం, గౌరెల్లి, తారామతిపేట పంచాయతీలు విలీనం కానున్నాయి. శంషాబాద్ మున్సిపాలిటీలో.. బహదూర్‌గూడ, పెద్దగోల్కొండ, చిన్నగోల్కొండ, హమీదుల్లానగర్, రషీద్ గూడ, ఘంసీమిగూడ విలీనం అవుతాయి. నార్సింగి మున్సిపాలిటీలో మీర్జాగూడ గ్రామపంచాయతీ విలీనం కానుంది. తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ గ్రామపంచాయతీ.. మేడ్చల్ మున్సిపాలిటీలో పూడూరు, రాయిలాపూర్ గ్రామపంచాయతీలు విలీనమవుతాయి. దమ్మాయిగూడ మున్సిపాలిటీలో.. కీసర, యాద్గిరిపల్లి, అంకిరెడ్డిపల్లి, చీర్యాల, నర్సపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాలు కలవనున్నాయి. నాగారం మున్సిపాలిటీలో బోగారం, గోదాముకుంట, కరీంగూడ, రాంపల్లి దాయార గ్రామాలు విలీనమవుతాయి. పోచారం మున్సిపాలిటీలో.. వెంకటాపూర్, ప్రతాపసింగారం, కొర్రెముల, కాచివానిసింగారం, చౌదరిగూడ విలీనం కానున్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాల్టీలో.. అంకుషాపూర్, ఔషాపూర్, మాదారం, ఏదులాబాద్, ఘనాపూర్, మర్పల్లిగూడ విలీనమవుతాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మునీరాబాద్, గౌడవెల్లి పంచాయతీలు, తూంకుంట మున్సిపాలిటీలో.. బొంరాసిపేట, శామీర్ పేట, బాబాగూడ పంచాయతీలు విలీనం కానున్నాయి.విలీన ప్రక్రియతో రెండు, మూడునెలల్లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలు ఇక్కడి గ్రామాల్లో జరిగే అవకాశం లేదు. ప్రస్తుతం కొనసాగుతున్న మున్సిపాలిటీల పదవీకాలం కూడా వచ్చే ఏడాది జనవరితో పూర్తికానుంది. ఆ తర్వాత ఇప్పుడు విలీనమైన 51 గ్రామపంచాయతీలతో కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు. మరోవైపు పంచాయతీల విలీనంపై ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీల్లో విలీనంతో తాము ఉపాధి పనులు కోల్పోవడంతో పాటు.. పన్నుల భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



---

# కల్యాణకట్టను పరిశీలించిన కార్య నిర్వహణాధికారి శ్రీనివాసరావు

శ్రీశైలం, డిసెంబర్ 6 ( రోమింగ్ న్యూస్ ) : పరిపాలనాంశాలలో భాగంగా ఈ రోజు (06.12.2024) కార్యనిర్వహణాధికారి కల్యాణకట్టను ఆకస్మికంగా పరిశీలించారు.ముందుగా కల్యాణకట్ట కౌంటరును తనిఖీ చేశారు. కౌంటర్లో విక్రయించిన టికెట్లతో నగదు సరిపోల్చి చూశారు.తరువాత సిబ్బందితో మాట్లాడుతూ సిబ్బంది భక్తులతో మర్యాదగా మెలగాలన్నారు. సిబ్బంది అందరు కూడా సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. సిబ్బంది వస్త్రధారణ సంప్రదాయపద్ధతిలో ఉండాలన్నారు. ఏకరూప దుస్తులు ధరించాలని ఆదేశించారు.కేశఖండనానికి వచ్చే భక్తులు అధికసమయం వేచివుండకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే కల్యాణకట్టను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు.కల్యాణకట్టలో విద్యుద్దీపాలు, ఫ్యాన్లు సజావుగా పనిచేసే విధంగా సంబంధిత సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరువాత కల్యాణకట్ట వద్ద భక్తులతో ముఖాముఖిగా సంభాషించి దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలపై భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.




---

# రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ఉక్కుపాదం

**దోషుల్ని పట్టుకునేందుకు ఏపీలో సిట్ ఏర్పాటు**

అమరావతి,డిసెంబర్ 6 : ఆంధ్రప్రదేశ్ లో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు మొత్తం 13ఎఫ్ఐఆర్‌లు నమోదవగా..వాటిపై లోతుగా దర్యాప్తు చేసి ఈ రేషన్ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని బయటకు లాగేందుకు ప్రత్యేక శ్రద్దచూపుతోంది.ఇందులో భాగంగానే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేకమైన సిట్ ను ఏర్పాటు చేసింది. ఆరుగురు పోలీసు ఉన్నతాధికారులతో ఏర్పాటైన ఈ సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్ లాల్‌ని నియమించింది. సిట్ బృందంలో ఇద్దరు ఐపీఎస్‌లు, నలుగురు డీఎస్పీలు ఉంటారు. ఇప్పటి వరకు నమోదైన ఎఫఐఆర్‌లపై లోతుగా దర్యాప్తు చేసి 15రోజులకు ఒకసారి ప్రభుత్వానికి సిట్ నివేదిక ఆంధ్రప్రదేశ్‌లో ఉచితంగా సప్లై చేసే రేషన్ బియ్యం పక్కదారి పడుతోందని%ॐ%కొందరు అక్రమార్కులు..అడ్డదారిలో దేశం నుంచే దాటిస్తున్నారని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే గత నెల రోజుల నుంచి కాకినాడ పోర్టు ద్వారా అక్రమంగా ఆఫ్రికాతో పాటు మరికొన్ని దేశాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లుగా గుర్తించింది. దీనిపై ఇప్పటికే పకడ్బంది ఏర్పాట్లు చేసింది. ఒక షిప్‌ను కూడా సీజ్ చేసింది.తాజాగా ఈ అక్రమ రేషన్ వ్యవహారాన్ని పూర్తిగా బయటపెట్టేందుకు ప్రభుత్వం ఉమాహేశ్వర్ ,అశోక్ వర్గన్, బాలసుందరరావు , గోవింద రావు, రత్తయ్య అనే ఆరుగురు ఉన్నతాధికారులో ప్రత్యేకంగా సిట్ ను ఏర్పాటు చేసింది. ఈ ఆరుగురిలో ఇద్దరు ఐపీఎస్ లు, నలుగురు డీఎస్పీలు ఉన్నారు. ఆరుగురు అధికారులో ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది ప్రభుత్వం.ఈ సిట్‌కు చీఫ్‌గా వినీత్ బ్రిజ్ లాల్‌ని నియమించింది. రేషన్ అక్రమాలతో పాటు విదేశాలు, ఆఫ్రికా కంట్రీస్‌కు తరలిస్తున్నట్లుగా నమోదైన ఎఫ్ఐఆర్‌లపై సిట్ రోజు విచారించనుంది. ప్రతి 15రోజులకు ఒకసారి దీనిపై కేసు పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. అంతేకాదు ఈ రేషన్ అక్రమాలపై దోషులుగా తేలిన వ్యక్తులను అరెస్ట్ చేసే అధికారాన్ని కూడా సిట్ కు అప్పగించింది ప్రభుత్వం.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 7 డిసెంబర్ 2024





## హరీశ్‌రావుతోపాటు కవిత నిర్బంధం

**హైదరాబాద్, డిసెంబర్ 6:** ఎమ్మెల్యేలు, నేతల అక్రమల అరెస్టులకు నిరసనగా ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు కవిత, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, పద్మారావు గౌడ్, కేపీ వివేకానంద, డాక్టర్ సంజయ్, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను హౌస్ అరెస్టు చేశారు. కోకాపేటలోని హరీశ్‌రావు ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఆయన బయటకి వెళ్లనీయకుండా గృహ నిర్బంధం చేశారు. దీంతో పోలీసులతో హరీశ్‌రావు వాగ్వాదానికి దిగారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించేందుకు వెళ్లకుండా ఈ నిర్బంధాలు ఎందుకని ప్రశ్నించారు. ఇక శుక్రవారం ఉదయం నుంచే ఎమ్మెల్సీ కవిత ఇంటికి పోలీసులు చేరుకున్నారు. ఆమెను ఇంట్లో నుంచి బయటకు రాకుండా చూస్తున్నారు. ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును హౌస్ అరెస్టు చేసిన పోలీసులు.. వారి నివాసాల వద్ద భారీగా మోహరించారు.

## ఇన్ని నిర్బంధాలు ఎందుకు?

### రాష్ట్రంలో నియంతృత్వ పాలన : హరీశ్‌రావు



**హైదరాబాద్,డిసెంబర్ 6 :** రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్ళనివ్వకుండా ఈ నిర్బంధాలు ఎందుకని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఇది నీ నిరంకుశ, నియంతృత్వ పాలనకు నిలువుటద్దమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఒకవైపు ప్రజా పాలన విజయోత్సవాలు అని ప్రచారం చేసుకుంటూ, మరోవైపు రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీని ప్రకటించావని ధ్వజమెత్తారు. మీ అప్రజాస్వామిక విధానాలు, రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వైఖరిని చూసి హైదరాబాద్ నడిగడ్డపై ఉన్న అంబేద్కర్ సైతం నివ్వెరపోతున్నాడని చెప్పారు. అదుపులోకి తీసుకున్న తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అరెస్టులతో భయపడా : కౌశిక్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 6 :** ఇలాంటి అరెస్టులకు భయపడేది లేదని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు హుజూరాబాద్ ప్రజల కోసం ప్రశ్నిస్తానన్నారు. ప్రజల ఇచ్చిన ఆరు గ్యారంటీల కోసం ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అర్ధరాత్రి జడ్జి బెయిల్ మంజూరు చేసిన అనంతరం అయన మీడియాతో మాట్లాడారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని తన నివాసంలో జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే నోటీసులు ఇచ్చి వదిలిపెట్టేందుకు అవకాశాలున్నా రాత్రి పొద్దుపోయే దాకా పీఎస్‌లోనే నిర్బంధించారు. రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి అర్ధరాత్రి కొత్తపేటలోని న్యాయమూర్తి ఇంట్లో హాజరుపరిచారు. వాదనలు విన్న జడ్జి.. రిమాండ్‌ను తిరస్కరించారు. రూ.5 వేలు జరిమాన, ఇద్దరి పూచీకత్తుతో కౌశిక్‌కు బెయిల్ మంజూరు చేశారు.

## బ్యాంకు ఖాతాకు 4 నామినీలు

### లోక్‌సభలో బిల్లు ఆమోదం!



**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 :** బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. ఈ బిల్లు ఒక బ్యాంకు ఖాతాలో 4 నామినీలను జోడించడానికి అందిస్తుంది. కొత్త బ్యాంకింగ్ చట్టం బిల్లులో డిపాజిటర్లకు మెరుగైన రక్షణ, ప్రైవేట్ బ్యాంకుల్లో మెరుగైన సేవలందించే అంశాలు కూడా ఉన్నాయి. క్లెయిమ్ చేయని షేర్లు, బాండ్‌లు, డివిడెండ్‌లు, వడ్డీ లేదా రిడెంప్షన్ ఆదాయాలను విద్య నిధికి బదిలీ చేయడానికి బిల్లు సులభతరం చేస్తుంది. ఇది పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడుతుంది. బదిలీ, వాపసు క్లెయిమ్‌ల కోసం సౌకర్యాన్ని అందిస్తుంది. బిల్లులోని ఇతర ముఖ్యమైన సవరణలు బ్యాంక్ డైరెక్టర్ల కోసం గణనీయమైన వడ్డీని అందుకోవడం గురించి కూడా ఉన్నాయి. దాదాపు ఆరు దశాబ్దాలుగా ఎలాంటి మార్పు లేకుండా ఉన్న ఈ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచాలనే నిబంధన బిల్లులో ఉంది.కోవిడ్ 19 మహమ్మారి కారణంగా ఏర్పడిన సమస్యల తర్వాత బ్యాంకింగ్ చట్ట సవరణ బిల్లులో ఈ ప్రధాన మార్పులు చేశారు. ఇప్పుడు ఒక నామినీకి బదులుగా 4 నామినీలు యాడ్ చేసేందుకు అనుమతి ఉంటుంది. ఖాతాదారుడు మరణించిన తర్వాత డబ్బు ఉపసంహరణను సులభతరం చేయడం దీని ఉద్దేశ్యం.డిపాజిటర్లు ఏకమొత్తం నామినేషన్‌ను ఎంచుకోవడానికి బిల్లు అనుమతిస్తుంది. నామినీకి నిర్ణీత శాతం షేర్లు లేదా సీక్వెన్షియల్ నామినేషన్ కేటాయించబడిన చోట నామినీ వయస్సు ప్రకారం బ్యాంకులో డిపాజిట్ చేసిన మొత్తం అందిస్తారు. ఈ మార్పు హోమ్ లోన్‌లకు యాక్సెస్‌ను సులభతరం చేస్తుందని, బ్యాంకింగ్ ప్రక్రియలలో ఆలస్యం తగ్గుతుందని భావిస్తున్నారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత బ్యాంకులు తమ నివేదికలను ప్రతి శుక్రవారం కాకుండా ప్రతి పక్షం రోజుల చివరి రోజున రిజర్వ్ బ్యాంక్‌కు సమర్పిస్తాయి. దీనితో పాటు నోటిఫై చేయని బ్యాంకులు మిగిలిన నగదు నిల్వలను నిర్వహించాలి. సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌ను రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులో పనిచేయడానికి కూడా బిల్లు అందిస్తుంది.బిల్లులో మరో ముఖ్యమైన మార్పు చేసినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటి వరకు ఏడేళ్లపాటు ఖాతాలో ఎలాంటి లావాదేవీలు లేకుంటే అది ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ సవరణ తర్వాత ఖాతాదారుడు ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ నుండి మొత్తం రీఫండ్‌ను క్లెయిమ్ చేయవచ్చు.

# కాంగ్రెస్ ప్రభుత్వం స్వేచ్ఛను హరిస్తున్నది

- ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే నిర్బంధాలా?
- నామీద అక్కసుతో సచివాలయం గేట్లు కూడా తెరవడం లేదు
- మాజీ మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 6:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో స్వేచ్ఛను హరిస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతుంటే అడ్డుకుంటున్నారని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేనట్లుగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నగరం నడిబొడ్డున కేసీఆర్ ఏర్పాటు చేశారు. సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి గౌరవించుకున్నామని చెప్పారు. తమమీద అక్కసుతో బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి నాడు కనీసం గేట్లు కూడా తెరవకుండా ఆ మహానీయున్ని నిర్బంధించి, అవమానిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం. కాంగ్రెస్ నిర్బంధిస్తున్నది బీఆర్ఎస్ నేతలను కాదని, అంబేద్కర్‌నని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహాన్ని నిర్లక్ష్యం చేయడం వెనుక మీ ఉద్దేశమేంటని ప్రశ్నించారు. దళితబంధు తొలగించి అంబేద్కర్ అభయహస్తం తెస్తామన్నారని, ఇప్పటి వరకు దాని అమలు ఊసేలేదని విమర్శించారు. దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న వారిపై దండిగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహం దగ్గర ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. వందల మంది పోలీసులను పెట్టి తమను నిర్బంధిస్తున్నారని విమర్శించారు. గురుకులాల్లో 48 మంది విద్యార్థులు చనిపోయారన్నారు. గురుకుల విద్యార్థులను తాము ఎవరెస్ట్ శిఖరాలు ఎక్కిస్తే.. మీరు పాడె ఎక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదేనా మీరు అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ గురుకుల బాటను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. ఉత్తరప్రదేశ్‌లో రాహుల్ గాంధీని అడ్డుకుంటే సీఎం రేవంత్ రెడ్డి రాజ్యాంగం గురించి మాట్లాడుతాడని, అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలను అడ్డుకోవడం ఎంతవరకు కరెక్టని విమర్శించారు. రాహుల్ గాంధీ చెప్పేదొకటి చేసేదొకటన్నారు. మీ సీఎంకు జ్ఞానోదయం చేయాలంటూ రాహుల్ గాంధీకి సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ అసమర్థతను ఎండగడుతామని చెప్పారు. మర్యాద అనేది ఇచ్చిపుచ్చుకునేదని, కావాలని అడుక్కుంటే రాదని ఎద్దేవా చేశారు. కనీసం నెల రోజులు సమావేశాలు జరగాలన్నారు. సచివాలయంలో రేవంత్ రెడ్డి ప్రతిష్టిస్తున్నది తెలంగాణ తల్లి విగ్రహమా లేదా కాంగ్రెస్ తల్లి విగ్రహమా అని ప్రశ్నించారు. ప్రభుత్వం మారినప్పుడల్లా లోగోలు, నంబర్ ప్లేట్లు మారాలా అని ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టారని విమర్శించారు. ఉద్యమ సమయంలో ప్రజలు స్వచ్ఛందంగా తెలంగాణ తల్లి విగ్రహాలు పెట్టుకున్నారని చెప్పారు. నాలుగేండ్ల తర్వాత ఎక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలో.. ఎక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఉండాలో అక్కడికి పంపిస్తామన్నారు.

## అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తే.. నిర్బంధామా.? : కేసీఆర్





**హైదరాబాద్, డిసెంబర్ 6 :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠించిన అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించకుండా నిర్బంధిస్తారా..? అని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇది దళితుల మీద కక్ష్యా..? మహనీయులు అంబేద్కర్ మీద వివక్షా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు వెళ్తున్న పలువురు బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ సర్కార్ గృహ నిర్బంధం చేసిన సంగతి తెలిసిందే. ఈ హౌజ్ అరెస్టులపై కేటీఆర్ఎస్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతాడు. ఆ రాజ్యాంగం రచించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని కేసీఆర్ గౌరవంగా తెలంగాణ నడిబొడ్డున హుస్సేన్ సాగర్ తీరాన సగౌరవంగా ప్రతిష్టించారు. అదే రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన సీఎం రేవంత్ కనీసం మహనీయుడు అంబేద్కర్ జయంతి, వర్ధంతులకు కనీసం దండేసి, దండంపెట్టి స్మరించుకునే అవకాశం ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన సచివాలయంలో, పోలీస్ కంట్రోల్ రూమ్‌లో సమీక్షలు చేస్తారు రేవంత్ రెడ్డి. కేసీఆర్ నిర్మించిన ఫ్లై ఓవర్లను, యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తూ.. కేసీఆర్ ప్రతిష్ఠించిన అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించకుండా నిర్బంధిస్తారా..? అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇది దళితుల మీద కక్ష్యా..? మహనీయులు అంబేద్కర్ మీద వివక్షనా..? అని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చివరకు జాగో తెలంగాణ జాగో అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ ప్రజలకు భారీ షాక్

### పెండింగ్ నల్లా కనెక్షన్ల బకాయిల వసూలుకు సన్నధం

**హైదరాబాద్, డిసెంబర్ 6 :** హైదరాబాద్‌లో ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటున్న నల్లా కనెక్షన్ల బకాయిలు వసూలు చేసేందుకు జలమండలి ఓటీఎస్ విధానం ప్రవేశపెట్టింది. దీని ద్వారా నల్లా బిల్లుల బకాయిలను ఎలాంటి ఆలస్య రుసుమూ, వడ్డీ లేకుండా చెల్లించే వీలుంది. తద్వారా ఇక బిల్లులు చెల్లించని వారు.. ఓటీఎస్ ఛాన్స్ వాడుకొని చెల్లించేసుకొని, బకాయిల బాధ లేకుండా చేసుకునే వీలు ఉంటుంది. మొదటగా దీనిని అక్టోబర్ 1 నుంచి 31, 2024 వరకు ప్రకటించి అమలు చేశారు. అయితే ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. దాంతో ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. ఓటీఎస్ ప్రకటించిన అక్టోబర్ నెలలో దసరా, దీపావళి పండుగలు రావడం, సిటీ ప్రజలు స్వగ్రామాలకు వెళ్లడంతో బకాయిల చెల్లింపులు సరిగా సాగలేదు. దీంతో ఓటీఎస్ గడువును నవంబర్ 30 వరకు పొడిగించింది ప్రభుత్వం. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేదు. 2020లో ఓటీఎస్ ద్వారా ప్రయోజనం పొందిన వారికి ఈ సారి అవకాశం లేకపోవడం ఒక కారణం అయితే.. ప్రజల్లో స్వతహాగానే బిల్లులు చెల్లించాలనే ఆసక్తి లేకపోవడం మరో కారణంగా కనిపిస్తోంది. హైదరాబాద్ జలమండలిలో పరిధిలో రూ.వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. అయితే 70,335 మంది బకాయిలు చెల్లించారు. వీరికి వడ్డీ, రుసుం రెండూ మాఫీ అయ్యాయి. నవంబర్ 30తో ఓటీఎస్ గడువు ముగిసింది. ఇప్పుడు మళ్లీ గడువు పొడిగించే ఉద్దేశంతో ప్రభుత్వం ఉన్నట్లు కనిపించట్లేదు. అందువల్ల నల్లా బిల్లుల బకాయిలు ఇంకా చెల్లించని వారు వెంటనే చెల్లించడం మంచిది. అలా కాదని మరింత ఆలస్యం చేస్తే, వడ్డీతోపాటూ పెనాల్టీ కూడా పెరిగిపోయే ప్రమాదం ఉంటుంది. ఎంత ఆలస్యం చేస్తే అంతలా భారం పెరుగుతుందని అధికారులు అంటున్నారు. అందువల్ల త్వరగా ఈ భారాన్ని దించుకోవాలని సూచిస్తున్నారు. ఒకవేళ ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకుంటే, నల్ల కనెక్షన్స్ కూడా రద్దు చేసే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.





## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం!

### తెలుగు రాష్ట్రాల్లో ప్రభావం చూపే అవకాశం

### పలు ప్రాంతాల్లో జోరు వానలకు అవకాశం

**హైదరాబాద్, డిసెంబర్ 6 :** దక్షిణాదిన దడ పుట్టించిన ఫెంగల్ తుపాన్ తీరం దాటడంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. ఫెంగల్ తుఫాను బలహీనపడి అల్పపడీనంగా మారి అరేబియా సముద్రంలోకి ప్రవేశించింది. దీంతో ఇప్పట్లో వానలు మళ్లీ రావులే అని జనాలు సంబరపడ్డారు. కానీ ఇంతలో వాతావరణ శాఖ మరో సంచలన వార్త అందించింది. తాజాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్టు వాతావారణ శాఖ వెల్లడించింది. ఈ మేరక శుక్రవారం వాతావరణ శాఖ ప్రకటన జారీ చేసింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాలో వాతావరణం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురుస్తుందని తెలిపింది. డిసెంబర్ 6,7 తేదీల్లో ఏర్పడే ఆవర్తనం దక్షిణ దిశగా పయనించే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. అది డిసెంబర్ 7 నాటికి అల్పపీడనంగా మారనున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. అది వాయువ్య దిశగా పయనించి డిసెంబర్ 12 నాటికి తమిళనాడు-శ్రీలంక తీర రేఖకు చేరుకుంటుందని అంచనా. దీని ప్రభావంతో తమిళనాడులోని దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. చెన్నైలోని కొన్ని ప్రాంతాలు, దాని శివారు ప్రాంతాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ శాఖ తెలిపింది. డిసెంబర్ 12, 13 తేదీల్లో తమిళనాడులోని దక్షిణ కోస్తా జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని %×వీణ% అంచనా వేసింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని హెచ్చరించింది. ఈ రోజుల్లో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించారు.కాగా ఇప్పటికే ఫెంగల్ తుఫాను ప్రభావం నుంచి నెల్లూరు, తిరుపతి, రాయలసీమ జిల్లాలు, అటు తమిళనాడు కోలుకోక ముందే తాజాగా బంగాళాఖాతంలో మరో అల్పపీడనానికి అనువైన పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆందోళ చెందుతున్నారు. ఆరుగాలం పండించిన పంట ఎక్కడ నీటపాలవుతుందోనన్న భయంతో అందిన కాడికి అమ్మేసుకుంటున్నారు. ఇక ఏపీలో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడనున్నాయి. మరికొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 7 డిసెంబర్ 2024





# సంక్రాంతికి సన్నబియ్యం ఇచ్చేనా?



తెలంగాణలో సన్నబియ్య ఆశలు సన్నగిల్లినట్టేనా? సంక్రాంతి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించారు. కానీ ప్రకటనలకు అనుగుణంగా పని మాత్రం కావడం లేదని సమాచారం. సన్నబియ్యం పంపిణీకి పౌరసరఫరాలశాఖ కనీస చర్యలు కూడా ప్రారంభించలేదని తెలుస్తున్నది. మంత్రులు ఇచ్చిన హామీ ప్రకారం సన్న బియ్యం పంపిణీకి మరో నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. కానీ ఇప్పటివరకు సన్న బియ్యం అస్సలే సేకరించలేదు. మరో ఆరు నెలలకు అవసరమైన దొడ్డు బియ్యం సేకరణ కోసం అధికారులు మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పట్లో సన్న బియ్యం పంపిణీ లేనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. న్న బియ్యం పంపిణీపై ప్రభుత్వ పెద్దల ఆలోచన బెడిసికొట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. సన్న ధాన్యానికి బోన స్ ఇస్తున్నందున అధిక విస్తీర్ణంలో సన్నాలు సాగవుతాయని, వాటి ద్వారా సన్న బియ్యం ఇవ్వొచ్చని ఆలోచించినట్టు తెలుస్తున్నది. ఇందుకు విరుద్ధంగా పౌరసరఫరాల సంస్థకు సన్నాలు రాకపోవడంపై అధికారుల్లో అంతర్మథనం మొదలైంది. వాస్తవానికి సన్న బి య్యం పంపిణీకి ఏటా 24లక్షల టన్నుల బి య్యం, 36లక్షల టన్నుల ధాన్యం అవసరం. కానీ ఇప్పటివరకు సివిల్ సైప్లై సంస్థ 10 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకో 5లక్షల టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన మరో 20 లక్షల టన్నుల ధాన్యం తక్కువ పడుతున్నది. ఇంత భారీస్థాయిలో సన్న బియ్యాన్ని బయట కొనుగోలు చేసి పంపిణీ చేస్తే సివిల్ సైప్లైపై భారీ ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో రేషన్‌లో సన్న బియ్యం పంపిణీ వాయిదా వేసినట్టు తెలుస్తోంది.

# వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు

- అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు అసాధారణం
- బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్
- మాజీ సీఎం కేసీఆర్



**హైదరాబాద్, డిసెంబర్ 6:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను, అనితర సాధ్యమైన కృషిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. దేశ స్వాతంత్ర్య అనంతరకాలంలో ప్రపంచానికే ఆదర్శవంతమైన స్వయంపాలన కోసం రాజ్యాంగాన్ని అందించారని తెలిపారు. ఆర్థిక సామాజిక రాజకీయ సాంస్కృతిక తదితర రంగాల్లో అణగారిన వర్గాలకు సమాన వాటా సమన్యాయం దక్కేలా రాజ్యాంగాన్ని పొందుపరచడం లో బాబాసాహెబ్ కనబరిచిన దార్శనికత మహోన్నతమైన దని కేసీఆర్ కొనియాడారు. దేశంలో రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా అంబేద్కర్ పొందుపరిచిన ఆర్టికల్ 3, ఈ దిశగా వారి దార్శనికత, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం చూపిందని గుర్తు చేశారు. వారి విశేష కృషిని, వారు అందించిన స్ఫూర్తిని చాటేందుకు ప్రపంచంలోనే అత్యంత మహోన్నతమైన రీతిలో వారి స్ఫురద్రూపాన్ని తెలంగాణాలో అత్యంత ఎత్తయిన విగ్రహం గా నిలుపుకున్నామన్నారు. దేశ పాలనకు తన రాజ్యాంగం ద్వారా బాటలు వేసిన బీఆర్ అంబేద్కర్ ఘనమైన కీర్తిని చాటేందుకు దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివిధంగా తెలంగాణ పాలనా భవనానికి 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్' అని పేరు పెట్టుకున్నామని తెలిపారు. వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన అంబేద్కర్ అజరామర కీర్తిని ప్రపంచానికి చాటేందుకు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. అనేక విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేసిందని తెలిపారు. అంటరాని వర్గాలుగా తర తరాలుగా వివక్షకు గురవుతున్న దళిత సమాజాన్ని ఆర్థికంగా బలోపేతం చేసి వారి సామాజిక గౌరవం ఇనుమడింప చేసే దిశగా, అంబేద్కర్ స్ఫూర్తితోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేసిందన్నారు. దళిత జీవితాల్లో వెలుగులు నింపే దిశగా దళిత బంధు సత్ఫలితాలు సాధించిందని తెలిపారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని రంగాల్లో వివక్ష లేని సమ సమాజ నిర్మాణానికి అవసరమైన కృషి చేయడం ద్వారానే, అంబేద్కర్ మహనీయునికి మనం ఘన నివాళి అర్పించగలమని కేసీఆర్ పేర్కొన్నారు.

# రాజ్యసభలో నోట్ల కలకలం

**222 సీటు వద్ద రూ. 500 కట్టలు**



**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎగువ సభలో భారీగా నగదు పట్టుబడింది. ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద నోట్ల కట్ట లభ్యమైనట్లు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖర్ తాజాగా వెల్లడించారు. సాధారణ భద్రతా తనిఖీల్లో భాగంగా గురువారం సభ వాయిదా పడిన తర్వాత సెక్యూరిటీ సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు చైర్మన్ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.500 నోట్లతో ఉన్న నగదు కట్టను గుర్తించినట్లు చెప్పారు. సీటు నంబర్ 222 నుంచి భద్రతా అధికారులు కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ సీటు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీ అభిషేక్ మను సింఘ్వీనికి కేటాయించిందిగా గుర్తించినట్లు చైర్మన్ వెల్లడించారు. ఈ అంశంపై విచారణకు ఆదేశించినట్లు ధన్‌ఖర్ వెల్లడించారు. మరోవైపు తాజా ఘటనపై కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అం శంలో సింఘ్వీ పేరును ప్రస్తావించడంపై మల్లికార్జున ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు.

## సభకు కేవలం రూ.500తో మాత్రమే వెళ్లా : ఎంపీ అభిషేక్ సింఘ్వీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 :** రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ సీటు వద్ద గురువారం తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో భారీగా నదును గుర్తించారు. ఈ అంశంపై ఇవాళ సభలో దుమారం రేగింది. అయితే ఆ ఘటన పట్ల తెలంగాణ నుంచి ఎంపీగా ఎన్నికైన సింఘ్వీ ఓ వీడియో ద్వారా ప్రకటన చేశారు. రాజ్యసభకు వెళ్తున్న సమయంలో.. ఒకే ఒక్క రూ.500 నోటు పట్టుకెళ్లుతానని సింఘ్వీ తెలిపారు. తన సీటు వద్ద నోట్ల కట్టలు ఉన్న విషయాన్ని మొదటిసారి విన్నట్లు చెప్పారు. గురువారం రోజున మధ్యాహ్నం 12.57 నిమిషాలకు సభలోకి వెళ్లానని, ఆ తర్వాత సరిగ్గా ఒంటి గంటకు సభ నుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆ తర్వాత క్యాంటీన్‌లో అయోధ్య రామిరెడ్డితో కలిసి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు కూర్చున్నట్లు చెప్పారు. సభలో 3 నిమిషాలు, క్యాంటిన్‌లో 30 నిమిషాలు మాత్రమే ఉన్నానని, దీనిపై కూడా రాజకీయం చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభలో 222 సీటు నెంబర్‌ను అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించారు. అయితే ఆ సీటు వద్ద నగదు లభించిన అంశంపై విచారణ చేపట్టనున్నట్లు చైర్మెన్ ధనకర్ తెలిపారు.

# రేవంత్ రెడ్డి హొదా, స్థాయిని మరిచి మాట్లడుతున్నారు

**చిల్లర మాటలు మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి**

**మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం**

హైదరాబాద్, డిసెంబర్ 6 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హొదాను, స్థాయిని మరిచి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డికి డీఎన్ఏ పరీక్ష జరగాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు శిక్ష తప్పదని హెచ్చరించారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నివాళు లర్పించిన ఈటల మాట్లాడుతూ... రాజ్యాంగ స్ఫూర్తిని ప్రధాని మోదీ సమున్నతంగా కాపాడుతున్నారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజలకు సేవకులుగా ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను దగా చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఏం మంచి చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకుంటుందో చెప్పాలన్నారు. ప్రజాక్షేత్రంలో తాము ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. రేవంత్ రెడ్డి ఈ ఏడాది కాలంలో ఏం చేశారని అన్ని వర్గాలు ప్రశ్నిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ దుర్మార్గాలను ఖండిస్తూ నిర్వహించబోయే సభకు జేపీ నడ్డా హాజరవుతారని తెలిపారు.

# డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదు

**డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు**

**డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన**

న్యూఢిల్లీ, డిసెంబర్ 6 : అంతర్జాతీయ వ్యాపారంలో డాలర్‌కు ప్రత్యామ్నాయం లేదని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. డాలర్ స్థానంలో వేరే కరెన్సీని ఉపయోగించే దేశాలపై పన్నులు పెంచుతామని చెప్పారు. అమెరికాకు ఆ దేశాలు ఉత్పత్తి చేసే వస్తువులపై పన్నులు 100 శాతం పెంచుతామని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాల ప్రయత్నాలను తాము ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉంటామని, డాలర్‌కు దూరంగా జరిగే దేశాలకు అమెరికా ఆర్థిక వ్యవస్థలో చోటుండదని హెచ్చరించారు. అమెరికాకు ఎగుమతుల విషయం మర్చిపోవాల్సి వస్తుందని వివరించారు. అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల సదస్సులో అంతర్జాతీయ లావాదేవీలలో డాలర్‌కు బదులుగా స్థానిక కరెన్సీ వాడాలని నిర్ణయించాయి. దీనివల్ల స్థానిక కరెన్సీ బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డాయి. ఈ సమావేశంలో ఈజిప్ట్, ఇరాన్, యూఏఈ ఈ ప్రతిపాదనకు అంగీకారం తెలిపాయి. ఓ డిక్లరేషన్‌పై బ్రిక్స్ దేశాలు సంతకం చేశాయి. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ఇండియా సహా బ్రిక్స్ దేశాలకు హెచ్చరికలు జారీ చేశారు.

# వడ్డీ రేట్లు యధాతథం..

**రెపోరేటు 6.50 శాతంగా కొనసాగింపు**

**వడ్డీ రేట్లను ప్రకటించిన గవర్నర్ శక్తికాంత దాస్**



న్యూఢిల్లీ, డిసెంబర్ 6 : దేశ ఆర్థిక వృద్ధి రేటు మందగించిన నేపథ్యంలో ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ నగదు నిల్వల నిష్పత్తిని 4.50 శాతం నుంచి 4 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని పెంచడంలో సహాయ పడుతుందని, తద్వారా బ్యాంకులు వృద్ధిని వేగవంతం చేయడానికి మరింత ఎక్కువ రుణాలను పంపిణీ చేయగలవని భావిస్తున్నారు. ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం రూ.1.16 లక్షల కోట్ల నగదును పెంచడంలో దోహదపడుతుంది. సెంట్రల్ బ్యాంక్ తన పాలసీ రేటులో అంటే రెపో రేటులో ఎలాంటి మార్పు చేయలేదు. రెపో రేటు 6.50 శాతం వద్ద కొనసాగుతోందని, ఫిబ్రవరి 2023 నుండి రెపో రేటులో ఎటువంటి మార్పు లేదని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది 11వసారి. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. క్యాష్ రిజర్వ్ రేషియోలో 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ప్రకటించారు. %జ== -% 4.50 శాతం నుండి 4 శాతానికి తగ్గించారు. నగదు నిల్వల నిష్పత్తి తగ్గింపును రెండు దశల్లో అమలు చేయనున్నారు. దీంతో బ్యాంకింగ్ వ్యవస్థలోకి రూ.1.16 లక్షల కోట్ల అదనపు నగదు అందుబాటులోకి వస్తుంది. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ మూడు రోజుల సమావేశం డిసెంబర్ 4న ప్రారంభం కాగా, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను శుక్రవారం(డిసెంబర్ 6) ప్రకటించారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడం, వృద్ధిని కొనసాగించడంతోపాటు ధరలను స్థిరంగా ఉంచడమే మా లక్ష్యం అని ఆర్‌బిఐ గవర్నర్ అన్నారు. అదే సమయంలో వృద్ధిని కొనసాగించడం ముఖ్యమని, ఇది ఆర్‌బిఐ చట్టంలో కూడా ఉందన్నారు. జిడిపి వృద్ధి రేటు క్షీణతపై ఆర్‌బిఐ గవర్నర్ మాట్లాడుతూ, ఆర్థిక వృద్ధి రేటు క్షీణతకు కారణం పారిశ్రామిక ఉత్పత్తి క్షీణత. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పారిశ్రామిక వృద్ధిరేటు 7.2 శాతం కాగా, రెండో త్రైమాసికంలో 2.1 శాతానికి తగ్గింది. తయారీ రంగం వృద్ధి రేటు తగ్గిందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ పెరిగిందని, అయితే పట్టణ ప్రాంతాల్లో డిమాండ్ తగ్గుతోందని ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. ఆర్‌బీఐ వృద్ధి రేటు అంచనాను తగ్గించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, ఆర్‌బిఐ జిడిపి వృద్ధి రేటు 6.6 శాతంగా అంచనా వేసింది. ఇది అంతకుముందు 7.2 శాతం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో జీపీపీ వృద్ధి రేటు 6.6 శాతంగా, నాల్గవ త్రైమాసికంలో 6.8 శాతంగా ఆర్‌బీఐ అంచనా వేసింది.

# ప్రపంచం ముంగిట మరో పెనుముప్పు

**దడపుట్టిస్తున్న బ్లీడింగ్ ఐ వైరస్..**

**15 రోజుల్లో 150 మంది మృత్యువాత**

**చికిత్సలేక ఇళ్లలోనే చనిపోతున్న జనాలు**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 6 :** ప్రపంచ దేశాలు 'బ్లీడింగ్ ఐ వైరస్' మహమ్మారికి గజగజ వణకుతున్నాయి. ప్రస్తుతం ఆఫ్రికాను వేధిస్తున్న ఈ వైరస్ అక్కడి నైరుతి కాంగోలో తొలిసారి బయటపడింది. ఈ అంతుచిక్కని వ్యాధి కాంగోలోని క్వాంగో ప్రావిన్సులో మారణహోమాన్ని సృష్టిస్తుంది. కేవలం 15 రోజుల్లో దాదాపు 150 మందిని పొట్టనబెట్టుకుంది. దీంతో ఆ దేశ ఆరోగ్య అధికారులు హెల్త్ ఎమర్జెన్సీ జారీ చేశారు. నవంబర్ 10 నుంచి నవంబర్ 25 మధ్య కాంగో ప్రావిన్స్‌లోని పాంజీ హెల్త్ జోన్‌లో ఈ మరణాలు సంభవించాయి. అంతుచిక్కని మరణాలను గల కారణాలను అన్వేషించడానికి రోగుల నుంచి నమూనాలు సేకరించేందుకు ఒక వైద్య బృందం పాంజీ హెల్త్ జోన్ చేరుకుంది. అక్కడి ప్రాంతీయ ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా ప్రకారం. దీని అనారోగ్య లక్షణాలు ఫ్లూని పోలి ఉన్నట్లు తెలిపారు. రోగుల్లో అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, దగ్గు, రక్తహీనత వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. దీనికి చికిత్స అందుబాటులో లేకపోవడంతో అనేక మంది రోగులు తమ ఇళ్లలోనే మృత్యువాత పడుతున్నారు. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలోని ఆరోగ్య అధికారులు సమస్యాత్మక ప్రదేశాల్లో జనాల అనారోగ్యంపై నిఘా ఉంచారు. ఇది అంటువ్యాధని, మృతదేహాల దరిదాపుల్లోకి కూడా ఎవ్వరూ రావొద్దంటూ అక్కడి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇక్కడి ఆరోగ్య సమస్యను పరిష్కరించడానికి, వైద్య సామాగ్రిని సరఫరా చేయాలని ఆరోగ్య మంత్రి అపోలినైర్ యుంబా దేశీయ, విదేశీ భాగస్వాముల సహాయం కోరారు. రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉంది. స్థానిక ఎపిడెమియాలజీ ప్రకారం, ఈ వ్యాధి మహిళలు, పిల్లలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్లు పేర్కొంది. మరణాల సంఖ్య వేగంగా పెరుగుతోందని, ఒక్క నవంబర్ 25వ తేదీన దాదాపు 67 మరణాలు నమోదైనట్లు అక్కడి ఆరోగ్య అధికారులు వెల్లడించారు. చైనా నుంచి శరవేగంగా ప్రపంచ దేశాలకు ప్రయాణించిన కోవిడ్ -19 వ్యాప్తితో కోట్లాది మంది ప్రాణాలు వదిలారు. కాంగోలో విజృంభిస్తున్న ఈ కొత్త వైరస్‌ను కట్టడి చేయకుంటే మరోమారు ప్రమదం ముంచుకొచ్చే అవకాశం ఉందని ప్రపంచదేశాలు ఆందోళన చెందుతున్నాయి.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శనివారం 7 డిసెంబర్ 2024





# అన్ని రంగాల్లో కాంగ్రెస్ మార్క్ పాలన

**కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు తెలంగాణను దోచుకుంది**

**బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలే ఇచ్చింది**

**తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**



హైదరాబాద్, డిసెంబర్ 6 : కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు తెలంగాణను దోచుకుందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. కానీ తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ కాంగ్రెస్ మార్క్ పాలన కనిపిస్తోందన్నారు.ప్రజాపాలన పండుగలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన దోపిడీ అంతా ఇంతా కాదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని కేటీఆర్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. లక్షల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన మీకు ప్రజలు మళ్లీ అధికారం ఇస్తారా? అని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని కేటీఆర్ చెబుతున్నారని, కానీ రాజీవ్ గాంధీ, ఆయన కుటుంబం చేసిన త్యాగం తెలుసా? అని ప్రశ్నించారు. వారి కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించిందన్నారు. తెలంగాణ కోసం కేటీఆర్ చేసిన త్యాగం ఏమిటో చెప్పాలని నిలదీశారు. భూములు, నిధులు, నియామకాల పేరుతో కేసీఆర్ కుటుంబం అడ్డంగా దోచుకుందని ధ్వజమెత్తారు.

## సచివాలయంలో ఈ నెల 9న విగ్రహావిష్కరణ

**కేసీఆర్, కిషన్ రెడ్డి అపాయింట్‌మెంట్ ఇస్తే వెళ్లి ఆహ్వానిస్తాం**

**తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు విపక్ష నేతలను ఆహ్వానిస్తాం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

హైదరాబాద్, డిసెంబర్ 6 : తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందుకోసం వారిని సమయం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. వారు అపాయింట్ మెంట్ ఇస్తే ప్రభుత్వం తరఫున ఆహ్వానిస్తామన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు విపక్ష నేతలను ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ఆహ్వానిస్తామని సీఎం రేవంత్ రెడ్డి నిన్ననే చెప్పారని గుర్తు చేశారు. వారు ఈ నెల 9న జరగనున్న ఈ కార్యక్రమానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

## బంగ్లాదేశ్ విభజించి హిందువులకు కొత్త దేశాన్ని ఇవ్వాలి

**మాజీ ఆర్మీ చీఫ్ సంచలన డిమాండ్**

న్యూఢిల్లీ, డిసెంబర్ 6 : బంగ్లాదేశ్‌లో హిందువులపై వేధింపులు కొనసాగుతున్నాయి. మైనార్టీలపై దాడులు, ఇళ్లను ధ్వసం చేస్తున్న సంఘటనలకు సంబందించిన వార్తలు నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితిపై భారత ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. అదే సమయంలో పలువురు హిందువుల కోసం ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలంటూ నినాదాలు వినిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ హిందువుల కోసం 'హిందూదేశ్' సృష్టించాలని డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ డిమాండ్ చేస్తోన్న వారు మరెవరో కాదు మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ జిడి బక్షి. ఈ విషయాన్నీ తన %శ% హ్యాండిల్‌లో పోస్ట్ చేసి బంగ్లాదేశ్ ఏర్పడం కోసం భారతీయ సైనికుల త్యాగాలను గుర్తు చేశారు.హిందువులను రోజుకో రకంగా దారుణంగా చిత్రహింసలకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయి. దీంతో యుకే పార్లమెంట్ లో తమ మౌనం వీడగా ట్రంప్ మంత్రి వర్గంలోని వారు కూడా ఇప్పటికే స్పందించారు. అయితే తాజాగా మాజీ ఆర్మీ రిటైర్డ్ జనరల్ జీడీ బక్షి కూడా నోరు విప్పారు. బంగ్లాదేశ్లోని హిందువుల కోసం ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ముహమ్మద్ యూనస్ నాయకత్వంలో బంగ్లాదేశ్ రాడికల్ జిహాదీ దేశంగా మారింది. మారణహోమం సృష్టించి.. తమ దేశంలో ఉన్న మైనారిటీ హిందువులను దేశం నుంచి తరిమికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని.. యుద్ధానికి సిద్ధమయ్యారన్నారు. పాకిస్తాన్ ఏలుబడిలో ఉన్న సమయంలో 1971లో 3800 మందికి పైగా భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళ సిబ్బంది పోరాడి బంగ్లాదేశ్ ఏర్పాటు చేసింది. పాక్ సైన్యం నుంచి బంగ్లాదేశ్ ను విడిపించేందుకు ఎందరో భారతీయు సైనికులు తమ ప్రాణాలను అర్పించారు. అయితే వీరు అసలు కృతజ్ఞత లేని వారు..అందుకే హిందూ మైనారిటీలను అంతం చేయాలనుకునే దిశగా నడుస్తున్నారు. కనుక ఇప్పుడు ఈ సమస్యకు సరైన సాధ్యమైన మార్గం..దేశాన్ని రెండుగా విడగొట్టి.. హిందూస్తాన్ ను ఏర్పాటు చేయమే అని చెప్పారు. ఈ పోస్ట్ తో పాటు బంగ్లాదేశ్ మ్యాప్ చిత్రాన్ని పోస్ట్ చేశారు. ఆ మ్యాప్ లో బంగ్లాదేశ్ ఉత్తర భాగాన్ని విభజించి హిందూ దేశ్ గా ఏర్పాటు చేయమని సూచిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రాథమికంగా రంగ్‌పూర్, దినాజ్‌పూర్‌లను ప్రత్యేక దేశం ఏర్పాటు చేయాలని జనరల్ జీడీ బక్షి డిమాండ్ చేశారు.

## ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు రేవంత్ రెడ్డికి ఆహ్వానం




హైదరాబాద్, డిసెంబర్ 6 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ప్రయాగ్ రాజ్ కుంభమేళాకు ఆహ్వానించారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు అలహాబాద్‌లో మహాకుంభమేళా జరగనుంది. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే కుంభమేళా సందర్భంగా పవిత్ర నదుల్లో స్నానం చేయడం మంచిదని భక్తులు భావిస్తారు.ఈ క్రమంలో హైదరాబాద్ వచ్చిన యూపీ ఉప ముఖ్యమంత్రి... తెలంగాణ సీఎంను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిసి ఈ మహాకుంభమేళాకు ఆహ్వానించారు. హిందూ క్యాలెండర్ ప్రకారం ప్రతి పన్నెండేళ్లకోసారి మాఘమాసంలోని అమావాస్య రోజున బృహస్పతి మేషరాశిలోకి ప్రవేశించినప్పుడు కుంభమేళా జరుపుకుంటారు.

## రాష్ట్రంలో చాలా అద్భుతంగా కాంగ్రెస్ పాలన

**ఓర్వలేక బీఆర్ఎస్ ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతుంది**

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్, డిసెంబర్ 6 : డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు కానుంది. బీఆర్ఎస్ నేతల విమర్శలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన చాలా అద్భుతంగా కొనసాగుతోందని.. అది ఓర్వలేక బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేసిందని మండి పడ్డారు. ప్రజలపై భారం వేయకుండా ఆర్థిక శాఖను ముందుకు కొనసాగిస్తున్నాం అన్నారు. ప్రపంచ వాతావరణం వల్ల గ్రీన్ ఎనర్జీ పై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని.. త్వరలోనే కొత్త విద్యుత్ పాలసీ తీసుకురాబోతునాం అని భట్టి విక్రమార్క అన్నారు.గత ప్రభుత్వం విద్యుత్ శాఖలో తీసుకున్న నిర్ణయాల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం అని తీవ్రంగా మండిపడ్డారు. ఒక్క యాద్రాద్రి భద్రాద్రి పవర్ ప్లాంట్ల వద్ద గత ప్రభుత్వం నిర్ణయాల వల్ల ప్రతి ఏటా 170 కోట్లకు పైగా భారం పడిందన్నారు. కొంతమంది స్వార్థం వల్ల విద్యుత్ రంగంలో ఆర్థిక భారం పడుతుందని భట్టి అన్నారు.

## ఏపీలో జాతీయ రహదారులకు ప్రాధాన్యత

**రూ.1,046 కోట్లతో 18 ఫ్లైఓవర్ల నిర్మాణాలు**

**ఏపీలో వంతెనల నిర్మాణాల వివరాలు వెల్లడించిన కేంద్రమంత్రి గడ్కరీ**

అమరావతి,డిసెంబర్ 6 : రూ.1,046 కోట్ల నిధులతో ఏపీలో జాతీయ రహదారులపై చేపట్టిన 18 ఫ్లైఓవర్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర రహదారి, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి లోక్ సభలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఏపీలో వంతెనల నిర్మాణాల పురోగతిపై ఆయన వివరాలు తెలియజేశారు. ఎన్‌హెచ్ - 216ఏ పై మోరంపూడి, జొన్నాడ, ఉండ్రాజవరం జంక్షన్, తేతలి, కైకరం వద్ద నిర్మిస్తున్న ఐదు వంతెనలు 2025 ఏప్రిల్ 2నాటికి పూర్తి అవుతాయని తెలిపారు. గుంటూరు మిర్చి యార్డ్ వద్ద నిర్మిస్తున్న వంతెన జనవరి 6నాటికి, విశాఖపట్నం ఎయిర్ పోర్టు జంక్షన్ వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ 2025 ఫిబ్రవరి 15కి, ఎన్‌హెచ్ - 16పై గొలగపూడి జంక్షన్, నెల్లూరు టీ జంక్షన్‌లో నిర్మిస్తున్న రెండు వంతెనలు 2025 సెప్టెంబర్ 11 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఎన్‌హెచ్ 16పై నాగులుప్పలపాడు గ్రోత్ సెంటర్, రాజుపాలెం జంక్షన్ వద్ద తలపెట్టిన వంతెనల నిర్మాణాలకు అనుమతి ఉత్తర్వులు ఇచ్చామని, ఇదే జాతీయ రహదారిలో రాజుపాలెం క్రాస్ రోడ్డు, జొన్నతాళి క్రాస్ రోడ్డు, చెవ్వూరు క్రాస్ రోడ్డు, రణస్థలం టౌన్ పోర్షన్‌తో పాటు ఎన్‌హెచ్ - 44 పై కియా వద్ద తలపెట్టిన ఫ్లైఓవర్ల నిర్మాణానికి బిడ్లు పిలిచామని వివరించారు.

# నాడు వారు.. నేడు వీరు..

## ప్రశ్నిస్తే ఎదురుదాడులు



రాజకీయ పార్టీలు అన్నీ ఒకేలా వ్యవహరిస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట? అధికారం రాగానే మరో మాట. ఇది వాటి సహజ స్వభావం. పార్లమెంట్ సమావేశాలు అందుకు ఉదాహరణ. పార్లమెంట్‌ని స్తంభింప జేయడం ప్రజాస్వామ్య రూపమేనని ఒకప్పుడు వాదించిన బిజెపి నేతలు ఇప్పుడు అదే పని చేస్తున్న ప్రతిపక్షంపై మండిపడుతున్నారు. ప్రతిపక్షాల నిరసన పార్లమెంట్ 'హైజాకింగ్' అట. ఈ మాట స్వయంగా ప్రధాని అన్నారు. అప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన నిరసన ఇప్పుడు పార్లమెంటును హైజాక్ చేయడం ఎలా అవుతుందో బీజేపీ నేతలే చెప్పాలి. తన సొంత రాజకీయ సందేశాలు ఇవ్వడానికి బిజెపి నాయకులు పార్లమెంటును వేదికగా ఉపయోగించు కుంటున్నారు. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై ప్రతిపక్ష బిజెపి సభ్యులు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడాన్ని 2012 సెప్టెంబరులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తప్పుపట్టారు. దీనిపై బిజెపి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ పార్లమెంట్ సమావేశాలను సాగనీయకపోవడం కూడా ప్రజాస్వామ్య రూపమేనని బదులిచ్చారు. యుపిఎ-2 ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వచ్చాయని, అందుకే సభలో ఆందోళన చేస్తున్నా మని ఆమె తెలిపారు. ఇది జరిగి ఓ సంవత్సరం గడిచింది. పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘిం చారంటూ 20 మంది బిజెపి, తెలుగుదేశం సభ్యులను హౌస్ బులెటిన్‌లో ప్రస్తావించినందుకు బిజెపి ఎగువ సభలో నిరసన తెలిపి, ఆ తర్వాత వాకౌట్ చేసింది. దీనిని సీనియర్ నేత అరుణ్ జైట్లీ సమర్థించుకున్నారు. ఆందోళన చేసిన అధికార పక్ష సభ్యులను వదిలేసి కేవలం ప్రతిపక్ష సభ్యులను మాత్రమే శిక్షించారని ఆయన మండిపడ్డారు. ఘటనలు జరిగి దశాబ్ద కాలం అయింది. ఇప్పుడు పార్లమెంట్ లో స్థానాలు మారాయి. అటు వారు ఇటు, ఇటు వారు అటు అయ్యారు. ప్రధా ని నరేంద్ర మోడీ ఆనాటి పార్టీ నేతల మాటలు మరచిపోయారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసన 'హైజాకిం గ్'కు ఓ రూపమని వ్యాఖ్యానించారు. 'ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నకర ఎత్తుగడల ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు నిరంతరం ప్రయ త్నిస్తున్నారు' అని విమర్శించారు. అప్పటి నుండి ఆయన మద్దతుదారులు, ఇతర బిజెపి నేతలు ఆయన మాటలను తరచూ వల్లె వేస్తూ పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింపజేయ డానికి ఏ రూపంలో ప్రయత్నించినప్పటికీ అది దేశాభివృద్ధిని అడ్డుకోవడానికి జరిపే కుట్రగానే భావించాలంటూ వితండవాదం మొదలు పెట్టారు. ఇక కార్పొరేట్ మీడియా కూడా ప్రధాని వ్యాఖ్యలను వెనకేసుకొచ్చింది. కొన్ని అంశాలపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు అది ప్రయత్నిస్తోంది కూడా. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వివాదానికి అదానీ కేంద్ర బిందువయ్యారు. ఆయనపై మోసం, ముడుపు ల ఆరోపణలు మోపుతూ న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీటు దాఖలైంది. కేంద్ర ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలపై కాంగ్రెస్‌తో పాటు అనేక ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై చట్టసభలో చర్చించాలని ఆ పార్టీలు కోరుతుంటే ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌పై కూడా చర్చించాల్సి ఉన్నదని ప్రతిపక్షాలు అడుగుతుంటే అందుకు కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదు. దీంతో సభ నుండి వాకౌట్ చేయడమో లేదా సభను బహిష్కరించడమో తప్ప ప్రతిపక్షాలకు వేరే మార్గం లేకుండా పోతోంది. రూల్ 267 కింద ప్రతిపక్షాలు అసాధారణ రీతిలో నోటీసులు అందించారు. లిస్టింగ్ అయిన సభా కార్యక్రమాలను ఆపేసి, అత్యవసర అంశాలపై చర్చకు పట్టుపట్టడానికి ఈ రూల్‌ను ప్రతిపక్షాలు వాడుకుంటాయి. సభా కార్యకలాపాలు నిలిచిపోవడానికి ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని కార్పొరేట్ మీడియా నిందిస్తోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిపోతాయేమోనని అది ఆందోళన వ్యక్తం చేస్తోంది. రూల్ 267 కింద చర్చకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ నిరాకరించారు. మణిపూర్ హింస, వరదల బారినపడి నష్టపోయిన వాయనాడ్‌కు ప్రత్యేక సాయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హింసపై కూడా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరగా ప్రభుత్వం విముఖత చూపుతోంది. 2012లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష బిజెపి డిమాండ్ మేరకు బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై చర్చించేందుకు అంగీకరించారు. నిర్భయ సామూహిక అత్యాచార ఘటనపై కూడా రోజుల తరబడి చర్చ సాగింది. ఈ చర్చల కారణంగానే లైంగిక దాడి విషయంలో కొత్త చట్టం వచ్చింది. అయితే ఇప్పుడు కాషాయ పార్టీ మాత్రం పార్లమెంటును తన రాజకీయ సందేశాల కోసం వాడుకుంటోంది. సభలో చర్చల సమయంలో హిందీని ప్రధాన భాషగా రుద్దేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. ఇరువురు సభాపతులు తటస్థ పరిశీలకుల మాదిరిగా కాకుండా బిజెపి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతిపక్ష నేతల మైక్రోఫోన్లను కట్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా సభా కార్యకలాపాలు ఏకపక్షంగానే సాగుతున్నాయి. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే వారిని సభ నుండి బహిష్కరిస్తున్న ఉదంతాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. హిందూత్వ ప్రచార చిత్రం 'ది సబర్మతి రిపోర్ట్'ను వీక్షించేందుకు మోడీ, ఆయన క్యాబినెట్ సహచరులు ఇటీవల పార్లమెంట్ గ్రంథాలయాన్ని వేదికగా మార్చేశారు. గడచిన రెండు ప్రభుత్వాల పాలనలోనూ ప్రధాని మోడీ పార్లమెంటుకు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో జరిగిన చర్చకు ఇచ్చిన సమాధానాన్ని కూడా ఆయన ఎన్నికల ప్రచారంగా మార్చేశారు. పార్లమెంటులో ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలపై ప్రభుత్వ వైఖరిని ఆయన స్పష్టం చేయలేదు. ఒకవేళ ప్రభుత్వం వైపు నుండి సమాధానాలు వచ్చినా అవి సాదాసీదాగా, దాటవేసే రీతిలో ఉంటున్నాయి. సభలో చర్చ జరపకుండానే అనేక బిల్లులను ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. బిల్లుల ప్రతులు తమకు అందలేదని, ముసాయిదాల అధ్యయనానికి తమకు తగిన సమయం ఇవ్వలేదని ప్రతిపక్షం తరచూ ఫిర్యాదు చేసింది. ప్రతిపక్ష ఎంపీలను ప్రజలు తిరస్కరించారంటూ మోడీ చేసిన ప్రకటన వారి పాత్రను తక్కువ చేసి చూపడమే అవుతుంది. వాస్తవానికి ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించింది ప్రతిపక్షాలను కాదు? బిజెపినే. భారత ప్రజాస్వామ్యంపై వ్యక్తమవుతున్న ఆందోళనకు పార్లమెంట్ 'హైజాకింగే' నిజమైన కారణమైతే అందుకు ఎవరిని నిందించాలో అందరికీ తెలిసిందే.








# పింక్ బాల్ టెస్ట్‌లో తేలిపోయిన టీమిండియా

- తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు
- విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆదుడుకున్న నితీష్‌కుమార్ రెడ్డి
- భారీ స్కోరు దిశగా ఆస్ట్రేలియా

ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో అడిలైడ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా తొలిరోజు తేలిపోయింది. మొదట బ్యాటింగ్‌లో విఫలమైన భారత్.. ఆ తర్వాత బౌలింగ్ లో కూడా పస చూపలేకపోయింది. దాంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ లో 33 ఓవర్లలో వికెట్ నష్టపోయి 86 పరుగులు చేసింది. ప్రస్తుతం మరో 94 పరుగులు వెనుకబడి ఉంది. మార్నస్ లబుషేన్ (67 బంతుల్లో 20 నాటౌట్‌బీ 3 ఫోర్లు), నాథన్ మెక్ స్వీని (97 బంతుల్లో 38 నాటౌట్ 6 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. వీరిద్దరు అజేయమైన రెండో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. ఉస్మాన్ ఖవాజ (13) వికెట్ ను భారత బౌలర్లు సాధించారు. అంతకుముందు టీమిండియా బ్యాటర్లు తేలిపోయారు. మరోసారి తెలుగు తేజం, యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆదుకోవడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులు చేయగలిగింది. నితీష్ కుమార్ రెడ్డితో పాటు కేఎల్ రాహుల్(64 బంతుల్లో 6 ఫోర్లతో 37), శుభ్‌మన్ గిల్(51 బంతుల్లో 5 ఫోర్లతో 31)



పర్వాలేదనిపించారు. విరాట్ కోహ్లీ(7), రోహిత్ శర్మ(3) దారుణంగా విఫలమయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/48) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఆదిలోనే గట్టి షాక్ తగిలింది. మిచెల్ స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ ఫస్ట్ బాల్‌కే యశస్వి జైస్వాల్ ఎల్బీగా వెనుదిరిగాడు. దాంతో భారత్ పరుగుల ఖాతా తెరవకుండానే వికెట్ కోల్పోయింది. క్రీజులోకి వచ్చిన శుభ్‌మన్ గిల్‌తో కలిసి మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ ఆచితూచి ఆడాడు. మంచి బంతులను గౌరవించిన ఈ జోడీ చెడ్డవాటిని బౌండరీలకు తరలించింది. 69 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో సెట్ అయిన ఈ జోడీని మిచెల్ స్టార్క్ విడదీసాడు. హాఫ్ సెంచరీకి చేరువైన రాహుల్(37)ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ వెంటనే క్రీజులోకి వచ్చిన కోహ్లీ(7) కూడా స్టార్క్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఆ మరుసటి ఓవర్‌లోనే నిలకడగా ఆడుతున్న శుభ్‌మన్ గిల్(31)ను స్కాట్ బోలాండ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. దాంతో భారత్ 82/4 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్ ఆరంభంలోనే రోహిత్ శర్మ(3)ను స్కాట్ బోలాండ్.. ఎల్బీగా పెవిలియన్ చేర్చాడు. నిలకడగా ఆడుతున్న రిషభ్ పంత్‌ను కమిన్స్ క్యాచ్ ఔట్ చేశాడు. దాంతో భారత్ 109 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. ఈ పరిస్థితుల్లో నితీష్ కుమార్ రెడ్డి, రవిచంద్రన్ అశ్విన్ దూకుడుగా ఆడారు. ముఖ్యంగా అశ్విన్.. 100 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు చేశాడు. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని స్టార్క్ విడదీసాడు. అశ్విన్(22)ను వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. అదే ఓవర్‌లో క్రీజులోకి వచ్చిన హర్షిత్ రాణా(0)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. బుమ్రాతో కలిసి నితీష్ కుమార్ రెడ్డి దూకుడుగా ఆడాడు. ట్రేడ్ మార్క్ షాట్స్‌తో అలరించాడు. స్విచ్ హిట్, రివర్స్ స్వీప్, కవర్ డ్రైవ్‌లతో బౌండరీలు రాబట్టాడు. బుమ్రాను కమిన్స్ ఔట్ చేయగా.. దూకుడుగా ఆడే క్రమంలో స్టార్క్ బౌలింగ్‌లో నితీష్ క్యాచ్ ఔటయ్యాడు. దాంతో భారత తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. పెర్త్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో నితీష్ ఇలానే దూకుడుగా ఆడి భారత్‌కు మెరుగైన స్కోర్ అందించాడు.

# ఆసియా కప్ 2024 టోర్నీలో ఫైనల్ చేరిన భారత యువ జట్టు



అండర్ 19 ఆసియా కప్ 2024 టోర్నీ భారత యువ జట్టు ఫైనల్ చేరింది. శ్రీలంక అండర్ 19 జట్టుతో శుక్రవారం జరిగిన రెండో సెమీఫైనల్లో భారత అండర్ 19 జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియా యువ సెన్సేషన్, 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ(36 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 67) మరోసారి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 46.2 ఓవర్లలో 173 పరుగులకు కుప్పకూలింది. శ్రీలంక బ్యాటర్లలోలాక్విన్ అబే సింఘే(110 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 69) హాఫ్ సెంచరీతో రాణించగా.. శారుజన్ షణ్ముగనాథన్(78 బంతుల్లో 2 ఫోర్లతో 42) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో చేతన్ శర్మ(3/34) మూడు వికెట్లు తీయగా.. కిరణ్, ఆయుష్ మాత్రే రెండేసి వికెట్లు పడగొట్టారు. యుధజిత్ గుహ, హార్దిక్ రాజ్‌కు చెరో వికెట్ దక్కింది. అనంతరం భారత అండర్ 19 జట్టు 21.4 ఓవర్లలోనే 3 వికెట్లకు 175 పరుగులు చేసి 170 బంతులు మిగిలి ఉండగానే విజయాన్నందుకుంది. వైభవ్ సూర్యవంశీతో పాటు ఆయుష్ మాత్రే(28 బంతుల్లో 7 ఫోర్లతో 34) రాణించాడు. కెప్టెన్ మహమ్మద్ అమాన్(26 బంతుల్లో 2 ఫోర్లతో 25 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. శ్రీలంక బౌలర్లలో విహాస్, విరన్, ప్రవీణ్ తలో వికెట్ తీసారు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మరోసారి 5 సిక్సర్లతో అలరించాడు. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రూ. 1.10 కోట్లు పలికి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ.. ఈ టోర్నీ తొలి రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. పాకిస్థాన్‌తో తొలి మ్యాచ్‌లో ఒక్క పరుగే చేసిన ఈ చోటా సూరీడు.. జపాన్‌తో 23 పరుగులకే వెనుదిరిగాడు. యూఏఈతో జరిగిన మూడో మ్యాచ్‌లో మాత్రం తన అసలు సిసలు బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 46 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76 పరుగులతో అజేయంగా నిలిచాడు. శ్రీలంకతో జరిగిన సెమీఫైనల్లో అదే జోరు కనబర్చాడు. రాజస్థాన్ రాయల్స్ ఈ చోటా సూరీడుని కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. 13 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ వేలంలో అమ్ముడైన ఆటగాడిగా ఈ బీహార్ కుర్రాడు రికార్డ్ సాధించాడు. అంతేకాకుండా అండర్ 19 క్రికెట్ చరిత్రలోనే అతి పిన్నవయస్కుడిగా కూడా నిలిచాడు. డిసెంబర్ 10న దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్లో బంగ్లాదేశ్ జట్టుతో భారత్ తలపడనుంది. పాకిస్థాన్‌తో జరిగిన తొలి సెమీఫైనల్లో ఆ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# మరోసారి తన బలహీతను బయటపెట్టిన కోహ్లీ



ఆస్ట్రేలియాతో ఐదు టెస్టల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న పింక్ బాల్ టెస్ట్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(7) తీవ్రంగా నిరాశపరిచాడు. మరోసారి తన బలహీతను బయటపెట్టిన కోహ్లీ.. స్లిప్‌లో స్టీవ్ స్మిత్‌కు సునాయస క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీని వెంటాడి మూల్యం చెల్లించుకున్నాడు. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో సెంచరీతో ఆకట్టుకున్న కోహ్లీ..పింక్ బాల్ టెస్ట్‌లో మాత్రం దారుణంగా విఫలమయ్యాడు. విరాట్ కోహ్లీ ఔటవ్వడంపై టీమిండియా మాజీ క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్స్ ఆడటంలో కోహ్లీ ఇబ్బంది పడుతున్నాడని, ఈ బలహీనతను అధిగమించేందుకు కూడా ప్రయత్నించడం లేదని పేర్కొన్నాడు. ఈ బలహీనత కారణంగానే టెస్ట్‌ల్లో కోహ్లీ యావరేజ్ తగ్గిందని అభిప్రాయపడ్డాడు. 'విరాట్ కోహ్లీ బ్యాటింగ్ యావరేజ్ దిగజారడానికి ప్రధాన కారణం ఒకటి ఉంది. అంతకుముందు 50 ప్లస్ ఉండే అతని యావరేజ్ 48కి పడిపోయింది. ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ డెలివరీలను ఆడే బలహీనత కోహ్లీని వెంటాడుతోంది. మరీ ముఖ్యంగా.. ఆ బలహీనత నుంచి బయటపడేందుకు కూడా కోహ్లీ ప్రయత్నించకపోవడం అతని మొండితనంలా అనిపిస్తోంది.'అని మంజ్రేకర్ ట్వీట్ చేశాడు. విరాట్ కోహ్లీ టెస్ట్ గణంకాలకు సంబంధించిన పోస్టలు కూడా నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఏడాది కోహ్లీ ఒక సెంచరీతో పాటు హాఫ్ సెంచరీ మాత్రమే చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా.. తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు ఆలౌటైంది. యువ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి(54 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42) విధ్వంసకర బ్యాటింగ్‌తో ఆదుకోవడంతో భారత్ గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది. కేఎల్ రాహుల్(64 బంతుల్లో 6 ఫోర్లతో 37), శుభ్‌మన్ గిల్(51 బంతుల్లో 5 ఫోర్లతో 31) పర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/48) ఆరు వికెట్లతో భారత్ పతనాన్ని శాసించాడు. ప్యాట్ కమిన్స్, స్కాట్ బోలాండ్ రెండేసి వికెట్లు తీసారు. కోహ్లీతో పాటు యశస్వి జైస్వాల్(0), రోహిత్ శర్మ(3) దారుణంగా విఫలమయ్యారు.

# చరిత్ర సృష్టించిన మిచెల్ స్టార్క్

అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న డే/నైట్ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 44.1 ఓవర్లలో 180 పరుగులకు ఆలౌటైంది. నితీశ్ కుమార్ రెడ్డి (42, 54 బంతుల్లో, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. కేఎల్ రాహుల్ (37, 64 బంతుల్లో, 6 ఫోర్లు), శుభ్‌మన్ గిల్ (31, 51 బంతుల్లో, 5 ఫోర్లు), రవిచంద్రన్ అశ్విన్ (22, 22 బంతుల్లో, 3 ఫోర్లు), రిషభ్ పంత్ (21, 35 బంతుల్లో, 2 ఫోర్లు) రాణించారు. మిగిలిన బ్యాటర్లూ ఎవరూ రెండంకెల స్కోరు అందుకోలేకపోయారు. యశస్వీ జైస్వాల్, హర్షిత్ రాణా, జస్‌ప్రీత్ బుమ్రా డకౌటయ్యారు. ఆస్ట్రేలియా బౌలర్లలో మిచెల్ స్టార్క్ (6/48) ఆరు వికెట్లతో విజృంభించాడు. ప్యాట్ కమిన్స్ (2/41), స్కాట్ బొలాండ్ (2/54) చెరో రెండు వికెట్లు తీశారు. అయితే ప్రధాన బ్యాటర్లు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టిన స్టార్క్ అరుదైన ఘనత సాధించాడు. పింక్ బాల్ టెస్టుల్లో అయిదు వికెట్ల ఘనతను నాలుగు సార్లు సాధించిన ఏకైక బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు.డే/నైట్ టెస్టుల్లో ఓ ఇన్నింగ్స్‌లో ఏ బౌలర్ రెండు కంటే ఎక్కువ సార్లు అయిదు వికెట్లను సాధించలేకపోయాడు. కానీ స్టార్క్ ఏకంగా నాలుగు సార్లు ఈ ఘనత సాధించాడు. కాగా, భారత్‌పై ఓ ఇన్నింగ్స్‌లో అయిదు వికెట్లు పడగొట్టడం స్టార్క్‌కు ఇదే తొలిసారి. కాగా, స్టార్క్ ఓవరాల్‌గా తన టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. 14.1 ఓవర్లు బౌలింగ్ చేసిన స్టార్క్ 48 పరుగులే ఇచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు 2016లో శ్రీలంకపై 50 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టిన రికార్డు తన అత్యుత్తమంగా ఉండేది.

## అభిమానులకు
# రిప్లై ఇవ్వడంలో వార్నర్ ప్రత్యేకం



సోషల్ మీడియాలో తమ అభిమాన క్రికెటర్ నుండి ప్రతిస్పందన కోసం కొన్ని రోజులపాటు నిరీక్షించటం అభిమానులకు కొత్తేమీ కాదు. కానీ, కొంతమంది అభిమానులు తమ తపనను ట్వీట్ల రూపంలో ప్రదర్శించి, వారి లక్ష్యాన్ని సాధిస్తారు. ఇటీవలి ఘటనలో, డేవిడ్ వార్నర్ రిప్లై ఒక భారతీయ అభిమాని కోరికను తీర్చడం అందరినీ ఆకర్షించింది. ఐపీఎల్ 2025 వేలంలో డేవిడ్ వార్నర్ అమ్ముడుపోకపోవడం అభిమానులకు పెద్ద షాక్ ఇచ్చింది. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం వహించిన వార్నర్, ఐపీఎల్‌లో అద్భుతమైన ఫామ్ కలిగిన ఆటగాడు. కానీ ఈసారి వేలంలో అతనికి ఎవరూ కొనుగోలు చెయ్యకపోవడం అందరికి ఆశ్చర్యం కలిగించింది. అయితే, ఆస్ట్రేలియన్ స్టార్ క్రికెటర్‌పై అభిమానులు చూపే ప్రేమ ఏమాత్రం తగ్గలేదు. తన అభిమాన క్రికెటర్ డేవిడ్ వార్నర్ నుండి రిప్లై రావడానికి ప్రయత్నిస్తున్న %జతీ-అషఋయ%బి45 అనే ట్విట్టర్ వినియోగదారు, వార్నర్‌ను ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు: అన్ని ఫార్మాట్లలో అత్యుత్తమ ఓపెనర్లలో ఒకరురిప్లై ఇచ్చే వరకు ట్వీట్ చేస్తూనే ఉంటాను??" అని ప్రకటించారు. అందరినీ ఆశ్చర్యపరుస్తూ, డేవిడ్ వార్నర్ వెంటనే ప్రతిస్పందిస్తూ, "హాయ్" అంటూ తన అభిమానిని ఆనందపరిచాడు. ఈ సరళమైన స్పందనతో అభిమాని సంతోషంతో చిందులు వేసాడు. వార్నర్ రిప్లై సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెటిజన్లు తమ అభిప్రాయాలతో స్పందించి, కామెంట్ల విభాగాన్ని నింపేశారు. కొంతమంది వార్నర్‌ను "అత్యుత్తమ ఓపెనర్"గా కొనియాడగా, మరికొందరు ఐపీఎల్‌లో అతని గైర్హాజరీని చర్చించారు. కొందరు అయితే, "పుష్ప 2cలో అల్లు అర్జున్‌తో కలిసి అతిథి పాత్రలో కనిపిస్తాడనే పుకార్లను కూడా ప్రస్తావించారు.ఇదీ తొలిసారి కాదు, డేవిడ్ వార్నర్ ఈ తరహా స్పందనల ద్వారా తన అభిమానుల గుండెల్లో చోటు సంపాదించుకున్నాడు. గతంలో కూడా అతను 23 రోజులపాటు ఎదురు చూసిన ఓ అభిమాని ట్వీట్‌కు స్పందించి, అభిమానుల మన్ననలు పొందాడు. ప్రస్తుతం భారత్-ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25లో రెండో టెస్ట్ అడిలైడ్‌లో పింక్-బాల్‌తో జరగనుంది. పింక్ బంతి టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లలో డేవిడ్ వార్నర్ ఒకరు. 17 ఇన్నింగ్స్‌లో 47.06 సగటుతో 753 పరుగులు చేసిన వార్నర్ ఈ ఫార్మాట్‌లో తన ప్రత్యేకతను నిరూపించాడు.వార్నర్ తన ఆటతీరుతోనే కాకుండా, తన అభిమానులందరికీ ప్రత్యేకమైన స్థానాన్ని కల్పించడంలో కూడా మాస్టర్. "హాయ్" అన్న చిన్న మాటతోనే ఆయన తమ అభిమాన గుండెల్లో చిరస్మరణీయుడై నిలుస్తాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News





## రెడ్ డ్రెస్‌లో మత్తెక్కిస్తున్న ఇస్మార్ట్ నభా

'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. ఈ అమ్మడు తెలుగులో ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. మొదటి సినిమాతో నటిగా మంచి పేరు సొంతం చేసుకున్న నభా ఆ తర్వాత సినిమాల్లో అందాల ఆరబోత చేయడం ద్వారా గ్లామర్‌తో మెప్పించింది. మొత్తానికి ఈ అమ్మడు టాలీవుడ్‌లో మంచి కమర్షియల్ హీరోయిన్‌గా నిలిచింది. ఈ అమ్మడు పూరి జగన్నాధ్ దర్శకత్వంలో చేసిన ఇస్మార్ట్ శంకర్ భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో మరింతగా పాపులారిటీ సొంతం చేసుకుంది. కానీ కరోనా వల్ల ఆ సినిమా హిట్‌ను నభా క్యాష్ చేసుకుని మరిన్ని ఆఫర్లు దక్కించుకోవడంలో విఫలం అయ్యింది. ఇస్మార్ట్ శంకర్ తర్వాత పెద్దగా సినిమాల్లో కనిపించని నభా నటేష్ మళ్లీ బిజీ అయ్యింది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఈ ఏడాది డార్లింగ్ అనే వెబ్ కంటెంట్‌తో ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చిన నభా నటేష్ వచ్చే ఏడాదిలో రెండు మూడు సినిమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు సినిమా ప్రయత్నాలు చేస్తూనే ఉంది. రెగ్యులర్‌గా ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది.

## సన్నజాజి తీగలా ఖుషీ ఖుషీగా

చూడగానే సన్నజాజి తీగలా కనిపిస్తోంది..! ఎవరు ఈ ముద్దుగుమ్మ? అంటారా.. అతిలోక సుందరి శ్రీదేవి రెండో కుమార్తె ఖుషీ కపూర్. జాన్వీకపూర్ సోదరి. అక్కా చెల్లెళ్లు ఇద్దరూ సెలబ్రిటీ ప్రపంచంలో ఎంతో యాక్టివ్ గా ఉంటారన్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా జాన్వీ పెద్ద స్టార్ గా ఎదిగేస్తుండగా, ఖుషీ కపూర్ ఆరంభ దశలో ఉంది. %-%ది ఆర్చీస్%-% తర్వాత తదుపరి భారీ సినిమాతో అభిమానుల ముందుకు రానుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. మరోవైపు ఖుషీ కపూర్ నిరంతర ఫోటోషూట్లు అంతర్జాలంలో వేడి పెంచుతున్నాయి. తాజాగా నటవారసురాలు ఖుషి చీరకట్టులో ఎంతో స్టైలిష్‌గా అందంగా కనిపించింది. సన్నజాజి తీగలా చీరలో హొయలు పోతున్న వైనం అందరినీ ఆకర్షించింది. ఖుషి ఒడ్డు పొడుగు ఉన్న అమ్మాయి. తన పొడుగు కాళ్ల సొగసును ఈ చీర మరింతగా ఎలివేట్ చేస్తోందని అంగీకరించాలి. మినిమల్ మేకప్ తో ఖుషి చీర లుక్కు ఎంతో అందంగా కుదిరింది. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.





## బ్రాండెడ్ కిల్లర్ పాండే!

లైగర్ బ్యూటీ అనన్య పాండే వ్యక్తిగత జీవితం తెరిచి ఉంచిన పుస్తకం. ఆదిత్యారాయ్ కపూర్ నుంచి విడిపోయిన తర్వాత ఈ భామ ఇటీవల పూర్తిగా సినిమాలపైనే దృష్టి సారించింది. నటిగా ఒక్కో సినిమాతో మంచి పేరు తెచ్చుకుంటున్న అనన్య ఇటీవలే పాపులర్ దుస్తుల బ్రాండ్ కి ప్రచారకర్తగా ఎంపికైంది. బ్రాండ్ ప్రచారకర్త అనన్య పాండే లేటెస్ట్ ఫోటోషూట్ యువహృదయాలను కొల్లగొడుతోంది. రకరకాల డిజైనర్ దుస్తుల్లో ఈ బ్యూటీ కిల్లర్ ఫోజులతో మతులు చెడగొడుతోంది. బ్లూ డెనిమ్స్ లో వెరైటీ డిజైన్స్ తో కిల్ చేసిన అనన్య.. దానికి పూర్తి కాంట్రాస్ట్ కలర్ స్కర్టులతోను మైమరిపించింది. ఐదారు భిన్నమైన దుస్తుల్లో అనన్య ఫోజులు దేనికదే ప్రత్యేకం. బ్లూ కలర్ డెనిమ్స్ లో కనిపించిన అనన్య బ్లూ బ్యాక్ గ్రౌండ్ ఫోటోషూట్ తో చాలా యూనిక్ గా కనిపించింది. డార్క్ బ్లూ ఫ్రాక్.. వైట్ అండ్ బ్లాక్ జీబ్రా లుక్... థై హై డిజైనర్ ఫ్రాక్ లో ఒకదానికొకటి భిన్నంగా తనను తాను ఎలివేట్ చేసుకుంది ఈ బ్యూటీ. ప్రస్తుతం ఈ అద్భుతమైన ఫోటోషూట్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986